ఆంధ్రజ్యోతి
andhrajyothy.com సోమవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 34.3 కనిష్ఠం 24.2

ఆదిలాబాద్ జిల్లా వార్తలు
5
మంగళవారం 2 జూలై 2024



అద్దె వసూళ్లు.. అగమాగం!




- పెండింగ్‌లో జడ్పీ వ్యాపార సముదాయ దుకాణాల అద్దె బకాయిలు
- అడిగేవారే లేక రెండేళ్లుగా నిలిచిపోయిన వసూళ్లు
- మొండికేసిన ఓ జడ్పీటీసీ, మరో జిల్లాస్థాయి నేత
- నోటీసులతోనే సరిపెడుతున్న జడ్పీ అధికారులు
- రాజకీయ ఒత్తిళ్లతో అడిగేందుకు జంకుతున్న సిబ్బంది
- ఈనెల 4వ తేదీతో ముగియనున్న జడ్పీ పాలకవర్గ పదవీ కాలం

ఆదిలాబాద్, జూలై 1(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ వ్యాపార సముదాయాల అద్దె వసూళ్లలో సంబంధిత అధికారులు నిండు నిర్లక్ష్యం వహిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. దీంతో అద్దె చెల్లింపుల్లో దుకాణాలను దక్కించుకున్న వ్యాపారులు పూర్తిగా మొండికేస్తున్నారు. గత రెండేళ్లుగా అద్దె వసూళ్లు లేకపోవడంతో జడ్పీకి ఆదాయం రాకుండానే పోయింది. ఇప్పటి వరకు రూ.6లక్షల 44వేల 200 అద్దె బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయి. నెలనెలా సక్రమంగా వసూళ్లు చేస్తే ప్రతీనెల జడ్పీకి రూ.83వేల 300 అద్దెల రూపంలో ఆదాయం వస్తుంది. కానీ అధికారులకు పట్టింపు లేకపోవడంతో అద్దె బకాయిలు భారీగా పేరుకు పోతున్నాయి. 2018లో కేంద్ర ప్రభుత్వం దీన్ దయాల్ పథకం కింద జిల్లా పరిషత్‌కు రూ.50లక్షల నగదు పురస్కారాన్ని అందించింది. ఈ నిధులతోనే జడ్పీ కార్యాలయానికి సమీపంలో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం పక్కన 16 అద్దె దుకాణాలను నిర్మించి టెండర్ ద్వారా కేటాయించారు. ఇదంతా బాగానే ఉన్న అధికారుల నిర్లక్ష్యంతో ప్రభుత్వ ఆదాయానికి భారీ గండిపడుతోంది. అసలే నిధులు లేక జడ్పీ పరిస్థితి అంతంత మాత్రంగా కనిపిస్తుంది. దీనికి తోడు వచ్చే ఆదాయ వనరులపై అధికారులు దృష్టి సారించక పోవడంతో జడ్పీ ఆర్థిక పరిస్థితి మరీ అధ్వానంగా మారింది. జూలై 4వ తేదీతో జడ్పీ పాలకవర్గ పదవీ కాలం ముగిసిపోనుంది. ఆ తర్వాత ఇక అడిగేవారే ఉండరన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రూ.లక్షల్లో అద్దె బకాయిలు పేరుకుపోయిన అడిగేందుకు మాత్రం జడ్పీ అధికారులు జంకుతున్నారన్న విమర్శలు వస్తున్నాయి.

చేతులెత్తేస్తున్న యజమానులు

టెండర్ ద్వారా జడ్పీ అద్దె దుకాణాలను దక్కించుకున్న పలువురు యజమానులు అద్దె చెల్లించకుండా చేతులెత్తేస్తున్నారు. గత రెండేళ్లుగా అద్దె చెల్లింపులు పూర్తిగా నిలిచిపోయాయి. మొత్తం 16 అద్దె దుకాణాలకు గాను 11, 12, 13, 16వ దుకాణాల యజమానులు మాత్రమే సక్రమంగా నెలనెలా అద్దెలను చెల్లిస్తున్నారు. మిగితా దుకాణాల యజమానులు గత రెండేళ్లుగా అద్దె చెల్లింపులు చేయడం లేదని తెలుస్తుంది. 16 షాపులకు గాను 15 షాపులకు మాత్రమే టెండర్లను నిర్వహించి దుకాణాలను కేటాయించారు. రాజకీయ ఒత్తిళ్లతో ఓ దుకాణం టెండర్ నిర్వహించకుండానే కేటాయించినట్లు ఆరోపణలు వస్తున్నాయి. మొదటి నుంచి జడ్పీ అద్దె దుకాణాల కేటాయింపులో పలు అక్రమాలు జరిగాయన్న ఆరోపణలున్నాయి. 2022 జనవరి నుంచి 2024 జూన్ వరకు అద్దె చెల్లించలేదంటే పరిస్థితి ఎంత అధ్వానంగా ఉందో ఇట్టే తెలుస్తుంది. అధికారులు తమ సొంత ఇంటిని అద్దెకు ఇచ్చి ఇలానే గాలికి వదిలేస్తారా అనే విమర్శలు లేక పోలేదు. రాజుల సైసా రాళ్లపాలు అన్నట్లుగా జడ్పీ అధికారుల తీరు మారిందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.



నేతల ఇష్టారాజ్యం

పదవీ, పలుకుబడిని అడ్డం పెట్టుకుని జడ్పీ దుకాణాలను దక్కించుకున్న ఇద్దరు నేతలు అద్దె చెల్లింపుల్లో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. ప్రస్తుతం జడ్పీటీసీగా కొనసాగుతున్న ఓ నేత 14 నెలలుగా అద్దెను చెల్లించకుండా మొండికేస్తున్నాడని అధికారులు పేర్కొంటున్నారు. జనవరి 2022 నుంచి జూలై 2022 వరకు 7 మాసాలు, నవంబర్ 2023 నుంచి మే 2024 వరకు మరో ఏడు మాసాలు మొత్తం 14 నెలలకు సంబంధించిన అద్దెను చెల్లించాల్సి ఉంది. నెలకు రూ.4700లతో అద్దె దుకాణాన్ని దక్కించుకున్న జడ్పీటీసీ సభ్యుడు 14 నెలలకు సంబంధించిన అద్దె బకాయి రూ.65వేల 800లు చెల్లించాలని అధికారుల లెక్కల ప్రకారం తెలుస్తుంది. ఇదేమిటని అడిగితే అధికారులను బెదిరింపులకు గురి చేయడం ఆయనకు అలవాటుగానే మారిందంటున్నారు. అలాగే ఓ జాతీయ పార్టీ మాజీ జిల్లా అధ్యక్షుడు జడ్పీ దుకాణాన్ని దక్కించుకుని అద్దెలు చెల్లించకుండానే కొనసాగుతున్నట్లు తెలుస్తుంది. రాజకీయ నేతలు కావడంతో అధికారులు కూడా అడిగేందుకు జంకుతున్నారు. జడ్పీ సమావేశంలో పలు సమస్యలపై అధికారులను ప్రశ్నించే ప్రజా ప్రతినిధులే అక్రమాలకు పాల్పడడంపై విమర్శలు వస్తున్నాయి. తక్కువ అద్దెకు దుకాణాలను దక్కించుకుని ఎక్కువ ధరకు మరోకరికి అద్దెకు ఇస్తు బినామిదందా చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయి.

దుకాణాల వారీగా రావాల్సిన అద్దె బకాయిల వివరాలిలా...

దక్కించుకున్న షాపు నెం.	చెల్లించాల్సిన బకాయిలు	దక్కించుకున్న షాపు నెం.	చెల్లించాల్సిన బకాయిలు
1వ నెం. షాపు	రూ.76వేలు	9వ నెం. షాపు	రూ.60వేల 500
2వ నెం. షాపు	రూ.31వేల 500	10వ నెం. షాపు	రూ.11వేలు
3వ నెం. షాపు	రూ.9వేలు	11వ నెం. షాపు	నిల్
4వ నెం. షాపు	రూ.56వేల 400	12వ నెం. షాపు	నిల్
5వ నెం. షాపు	రూ.65వేల 800	13వ నెం. షాపు	నిల్
6వ నెం. షాపు	రూ.70వేలు	14వ నెం. షాపు	రూ.42వేలు
7వ నెం. షాపు	రూ.70వేలు	15వ నెం. షాపు	రూ.42వేలు
8వ నెం. షాపు	రూ.లక్ష 10వేలు	16వ నెం. షాపు	నిల్

నోటీసులు ఇస్తూ.. వదిలేస్తున్నారు!!



రూ.లక్షల్లో అద్దె బకాయిలు పెరిగిపోతున్నా అధికారులు నామమాత్రంగానే చర్యలు తీసుకుంటూ వదిలేస్తున్నారు. రెండేళ్లుగా అద్దె వసూళ్లు నిలిచిపోయినా.. అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారు. ఇప్పటికే పలుమార్లు నోటీసులు ఇచ్చిన పలు దుకాణాల యజమానులు స్పందించినట్లు కనిపించడం లేదు. నిబంధనల ప్రకారం సక్రమంగా అద్దె చెల్లించని వారి దుకాణాలను స్వాధీనం చేసుకునే అవకాశం ఉన్న రాజకీయ నేతల ఒత్తిళ్లతో అధికారులు వెనుకడుగు వేస్తున్నారు. నోటీసులు ఇవ్వడం, ఆ తర్వాత అసలు విషయాన్ని మరిచిపోవడంతో అద్దె బకాయిలు భారీగా పెరిగిపోతున్నాయి. కొంతమంది యజమానులు రెండేళ్లుగా అద్దె చెల్లించ లేదంటే పరిస్థితి ఎంత అధ్వానంగా ఉందో తెలుస్తూనే ఉంది. ఒకరిద్దరు యజమానులైతే ప్రారంభం నుంచి ఇప్పటి వరకు నయా పైసా కూడా చెల్లించలేదు. అయినా అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇకనైనా చట్టపరమైన చర్యలు తీసుకుంటే జడ్పీకి రూ.లక్షల ఆదాయం సమకూరే అవకాశం ఉందన్న వాదనలు వినిపిస్తున్నాయి.

పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం

: రత్నమాల, జడ్పీ సీఈవో, ఆదిలాబాద్



జడ్పీ అద్దె దుకాణాల బకాయిల విషయమై నా దృష్టికి వచ్చింది. పరిశీలించి చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే అధికారులను ఆదేశించడం జరిగింది. నివేదిక అందగానే యజమానులను పిలిపించి మాట్లాడుతాం. ఇదివరకే నోటీసులు కూడా ఇవ్వడం జరిగింది. నెలనెలా సక్రమంగా అద్దె చెల్లించని యజమానుల పై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

సంక్షిప్త సమాచారం

పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్‌గా కె.వీరస్వామి

ఆదిలాబాద్ రూరల్, జూలై 1: జిల్లా కేంద్రంలోని సంజయ్‌గాంధీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల నూతన ప్రిన్సిపాల్‌గా ఇదే కళాశాలలో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగాధిపతిగా మూడున్నర సంవత్సరాల నుంచి విధులు నిర్వహిస్తున్న కోట వీరస్వామి సోమవారం ప్రిన్సిపల్ ఎఫ్‌ఏసీగా బాధ్యతలు స్వీకరించారు. కిట్స్, వరంగల్ నుంచి బీటెక్, జేఎన్టీయూ, హైదరాబాద్ నుంచి ఎంటెక్ చేశారు. కళాశాల విభాగాధిపతులు రాజ్‌కుమార్, మాషయ్య, రాజన్న, సుజయ్, క్రాంతికుమార్, పరిపాలన అధికారి రాజేష్, అధ్యాపకులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

'ఫీజు బకాయిలు చెల్లించండి'

నేరడిగొండ, జూలై 1: ఫీజు బకాయిలు చెల్లించాలని కోరుతూ సోమవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌కు డిగ్రీ కళాశాల అధ్యాపకులు వినతిపత్రం అందజేశారు. గత 3ఏళ్ల నుంచి పెండింగ్‌లో రీ ఎంబర్స్‌మెంట్, ఉపకార వేతనాలు ఉండడం వలన డిగ్రీ కాలేజిలు నడపడం చాలా దుర్భరంగా ఉందని ఇప్పటికే చాలా కాలేజిలు మూతపడడం జరిగింది అని అధ్యాపకుల వేతనాలు ఇవ్వడం ఇతర అన్ని రకాలుగా ఇబ్బంది ఉండడం వలన ప్రభుత్వం వెంటనే రీ ఎంబర్స్‌మెంట్, ఉపకార వేతనాలు విడుదల చేసేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో కార్తిక్, రాజ్‌కిరణ్ రెడ్డి, లింగన్న తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి : ఏఐటీయూసీ

ఆదిలాబాద్ అర్బన్, జూలై 1: రాష్ట్ర మున్సిపల్ స్టాఫ్ అండ్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు మెరుగు చిరంజీవి అధ్యక్షతన ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో యూనియన్ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్రదేవేందర్, ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ ప్రధాన కార్యదర్శి గాజంగుల రాజులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో పలు అంశాలపై చర్చించి తీర్మానాలు చేశారు. అనంతరం సిర్రదేవేందర్ మాట్లాడారు. ఇందులో జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీను, ఊశన్న, సురేష్, అశోక్, గేడం, పొచ్చిరామ్, యాదగిరి, గాజంగుల శేఖర్, నక్క శంకర్, నాగరాజు, రాజులున్నారు.

ఆదివాసీ చరిత్ర ఉట్టి పడేలా..

అమర వీరుల స్మృతి వనం ఏర్పాటు

- అమరవీరుల స్థూపంతో పర్యాటక శోభ
- ఇంద్రవెల్లిలో భూమిపూజ చేసి పనులను ప్రారంభించిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క

ఇంద్రవెల్లి, జూలై 1: 1981 ఏప్రిల్ 20న జల్... జంగల్... జమీన్ పేరిటి నినదించి అమరులైన వీరుల స్థూపం వద్ద ఆదివాసి చరిత్ర ఉట్టి పడేలా స్మృతి వనం రూ.కోటి వ్యయంతో ఏర్పాటు చేయబోతున్నామని పంచాయితీ రాజ్ శిశు సంక్షేమ శాఖ, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని అమర వీరుల స్థూపానికి ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, జిల్లా కలెక్టర్ రాజార్షిషా ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్త, జిల్లా ఎస్పీ గౌస్ ఆలంతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, ఆదివాసీ సంఘాల నాయకులతో కలిసి ఆదివాసీ గిరిజన అమరవీరులకు ఘన నివాళులర్పించారు. అనంతరం స్మృతి వనం పనులకు భూమిపూజ చేసి ప్రారంభించారు. తదనంతరం స్మృతి వనం నమూనాను చూశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మంత్రి సీతక్క మాట్లాడుతూ అన్ని హంగులతో అమర వీరుల స్థూపాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.కోటి మంజూరు చేసిందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారన్నారు. పర్యాటకులతో పాటు అమరవీరులకు నివాళులర్పించడానికి వచ్చే ఆదివాసీలకు ఆకర్షించేందుకు అన్నిరకాల మొక్కలు, చెట్లను నాటడం జరుగుతుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అదనంగా ఒక ఎకరం భూమి కొనుగోలు కోసం కసరత్తు చేస్తామని తెలిపారు. ఆసిఫాబాద్ జిల్లాలోని జోడెన్-ఘాట్‌లో గల కొమురం భీం మ్యూజియంలో అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం కసరత్తు చేస్తోందని తెలిపారు. అన్ని సౌకర్యాలతో ఇంద్రవెల్లి అమర వీరుల స్మృతి వనం అద్భుతంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు. త్వరలో అమరులైన కుటుంబాలకు ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామన్నారు. కొమురం భీంను స్ఫూర్తిగా తీసుకుని ముందుకెళ్లాలని సూచించారు. హైమన్ డార్ఫ్ ఆదివాసీల జీవన స్థితిగతులపై అధ్యయనం చేసి ప్రత్యేక చట్టాలు తేవడానికి కృషి చేశారని, ఆయన చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సబ్బండా వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ జిల్లా సార్మేడి మెస్రం దర్కు, జడ్పీటీసీ పుష్పలతా, ఆర్డీవో జీవాకర్‌రెడ్డి, ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్, సీఐ మొగిలి, రగల్ జెండా కమిటీ అధ్యక్షుడు తొడసం నాగోరావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముఖడే ఉత్తం, తదితరులు పాల్గొన్నారు.



ఇంద్రవెల్లిలో అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి సీతక్క

'రూ.3.75 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు'

ఉట్నూర్: మండలంలోని రామలింగంపేట నుంచి శ్యామ్ నాయక్ తాండ వరకు రూ.3.75కోట్లతో చేపట్టిన తారురోడ్డు, వాగుపై వంతెన పనులకు రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క ప్రారంభించారు. సోమవారం ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్‌తో కలిసి అభివృద్ధి పనులను ప్రారంభించిన సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి తేవడానికి కృసి చేస్తున్నామని అన్నారు. అంతకు ముందు మండల కేంద్రంలోని కొమురంభీం ప్రాంగణానికి చేరుకున్న మంత్రి సీతక్కకు కలెక్టర్ రాజార్షిసా, ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్త పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎస్పీ గౌస్‌ఆలం, ఐటీడీఏ ఈఈ రాథోడ్‌భీమ్ రావు, ఎంపీపీ పంద్ర జైవంత్‌రావు, సీఐ గండికోట మొగిలి, జడ్పీటీసీ చారులత రాథోడ్, ఏఈ ఇందల్, కాంట్రాక్టర్ ముంతాజ్ అహమ్మద్, తదితరులు పాల్గొన్నారు.

'వన మహోత్సవంలో భాగస్వాములు కావాలి'

మావల: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వన మహోత్సవ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని మంత్రి సీతక్క అన్నారు. సోమవారం మావల సమీపంలోని అర్బన్ పార్కులో ఏర్పాటు చేసిన వన మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు. అంతకుముందు అర్బన్ పార్కుకు మంత్రి చేరుకోగానే అధికారులు, ప్రజాప్రతినిధులు ఆమెకు ఘన స్వాగతం పలికారు. అటవీ అధికారులు ఏర్పాటు చేసిన సఫారీ వాహనంలో ప్రయాణించి పార్కును పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, వెడ్మ బొజ్జు పటేల్, కలెక్టర్ రాజార్షిషా, ఎస్పీ గౌస్ ఆలంలతో కలిసి మొక్కలు నాటారు. పర్యావరణ విజ్ఞాన కేంద్రంలో ఛాయా చిత్రాలను వీక్షించారు. ఈ మేరకు మంత్రి మాట్లాడుతూ మావల అర్బన్ పార్కు ఆహ్లాదభరితంగా ఉందన్నారు. ఎక్కడో టైగర్‌జోన్ పార్కులో మాత్రమే సఫారీలో ప్రయాణించి చూస్తాం కాని ఒక అర్బన్ పార్కులో సఫారీలో ప్రయాణించాల్సి వచ్చిందంటే పార్కు యొక్క విశిష్టత దట్టమైన అటవీ ప్రాంతాన్ని కలిగి ఉండటమేనన్నారు. మావల అర్బన్ పార్కులో చాలా రకాలైన పక్షి జాతులు, వివిధ రకాల చెట్లు, జంతువులతో ఆహ్లాదకరంగా పర్యాటకుల్ని విశేషంగా ఆకర్షిస్తుందన్నారు. మావల పార్కును మరింత అభివృద్ధి చేసి రాష్ట్ర పార్కుగా చేస్తామన్నారు. వన మహోత్సవంలో 44 లక్షల మొక్కలు నాటడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ప్రజాప్రతినిధులు అందరి సహకారంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అన్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

అధికారులు అంకితభావంతో పని చేయాలి

- జిల్లా అధికారులతో మంత్రి సీతక్క సమీక్ష

ఆదిలాబాద్ అర్బన్: అంకితభావంతో అధికారులు పని చేసి ప్రజా సమస్యల పరిష్కారానికి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్ శిశు సంక్షేమ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి మాట్లాడారు. సంక్షేమ అభివృద్ధి ఫలాలు గ్రామ ప్రజలకు అందేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. ముఖ్యంగా మిషన్ భగీరథ, రహదారులు, వైద్యం, మహిళ శిశు సంక్షేమ శాఖ, ఇరిగేషన్, అంగన్‌వాడీ కేంద్రాల పై సమీక్షించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్యాధికారులు గ్రామాల్లో అవగాహన కల్పించాలని, వైద్యాధికారులు ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వరదల కారణంగా ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు. మహిళ శిశు సంక్షేమ శాఖ ద్వారా సరఫరా అవుతున్న పౌష్టికాహారం, గుడ్లు తదితర వాటి పై ప్రత్యేక దృష్టి సారించి నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. జిల్లా అభివృద్ధి, ప్రజా సంక్షేమంలో అధికారులకు సహకరించే బాధ్యత ప్రజా ప్రతినిధుల పై ఉందని, మంచి నిర్ణయాలతో అభివృద్ధి చేసే రాజకీయాలకు అతీతంగా అందరు కలిసి అంకిత భావంతో జిల్లాను అభివృద్ధి పథంలో ముందు ఉండే విధంగా సమష్టిగా కృషి చేద్దామని పేర్కొన్నారు. మిషన్ భగీరథ ద్వారా చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు సరిగా లేక పోవడం వల్ల గ్రామాలలో నీటి ఎద్దడి తలెత్తుతుందని, మిషన్ భగీరత ఇంటింటికి నీరు అందించే దిశగా పెండింగ్‌లో ఉన్న పనులను త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ జిల్లా అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి పథకాలు ప్రతి గ్రామానికి చేరే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఇందులో ఎమ్మెల్యేలు పాయల శంకర్, వెడ్మబొజ్జు, జిల్లా ఎస్పీ గౌస్‌ఆలం, ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్త, డీఎఫ్‌వో, అదనపు కలెక్టర్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు పరికరాల పంపిణీ

ఆదిలాబాద్ అర్బన్: దివ్యాంగులకు సహకార ఉపకరణాలను సోమవారం కలెక్టరేట్ ఆవరణలో మంత్రి సీతక్క పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారికి అవసరమయ్యే చంక కర్రలు, మూడు చక్రముల బండి మెటోరిజెడ్ వెహికలే, ల్యాప్‌టాప్, అందుల కర్రలు, 4జీ ఫోన్, క్యాలిపర్స్, వీల్‌చైర్స్ ఎంపీ 3 ప్లేయర్స్, బ్యాటరీ వీల్‌చైర్, టీచింగ్‌కి సంబంధించిన పుస్తకాలు, బ్యాటరీ ట్రై సైకిల్స్, తదితర పరికరాలు తెలంగాణ వికలాంగుల కో ఆపరేటివ్ కార్పొరేషన్ ద్వారా సరఫరా చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజార్షిషా, ఎస్పీ గౌస్‌ఆలం, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్త, ఆదిలాబాద్ ఎమ్మెల్యేల పాయల శంకర్, ఖానాపూర్ వెడ్మబొజ్జు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

'పోడు భూములకు పట్టాలు ఇవ్వాలి'

ఉట్నూర్, జూలై 1: ఆదివాసీలు సాగు చేస్తున్న పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయంముందు గ్రామీణ పేదల సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అంతకుముందు సోమవారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి ఐటీడీఏ కార్యాలయంలో సమస్యలతో కూడిన వినతి పత్రం ఏపీవోకు అందజేశారు.



ఐటీడీఏ ముందు ధర్నా చేస్తున్న గ్రామీణ పేదల సంఘు నాయకులు

ఈ సందర్భంగా గ్రామీణ పేదల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు నేతవాత్ రాందాస్ మాట్లాడుతూ గిరిజనులు సాగు చేస్తున్న పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని రైతులందరికి రైతుబంధు పథకం అమలు చేయాలని, గిరిజనులు సాగు చేస్తున్న పోడు భూములలో ఫారెస్టు అధికారులు బలవంతంగా కందకాలు తవ్వడం నిలిపి వేయాలని, అన్నిరకాల వరి పంటకు బోనస్ ప్రకటించాలని, రైతులకు రూ.రెండు లక్షల రుణమాఫీ చేయాలని, భూమిలేని పేదల కుటుంబాలకు మూడు ఎకరాల భూమిని పంపిణీ చేయాలని అర్హులైన పేదలందరికీ ఇళ్లు, రేషన్ కార్డులు పంపిణీ చేయాలని, అర్హులైన పేదలందరికీ పెన్షన్ ఇవ్వాలని రైతుబంధు ఎకరానికి రూ.15,000 ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ పేదల సంఘం రాష్ట్ర నాయకులు కుటికెల శంకర్ గ్రామీణ పేదల సంఘం జిల్లా అధ్యక్షులు కార్యదర్శులు సిడాంధర్మం, ఎనుముల నరసయ్య, దారెంగు ఎల్లయ్య, చంద్రయ్య, మహిళ సంఘం నాయకురాలు సంధ్య, వనతి, ఆదివాసీ మహిళలు గిరిజనులు, తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల సమస్యల పరిష్కారానికి పటిష్ఠ చర్యలు

- గిరిజన దర్బార్‌లో అర్జీలను స్వీకరించిన ఏపీవో జనరల్ భీమ్రావు

ఉట్నూర్, జూలై 1: ఉమ్మడి జిల్లాలోని గిరిజన ప్రజల సమస్యల పరిష్కారానికి పటిష్ఠ చర్యలు తీసుకోవాలని ఐటీడీఏ ఏపీవో కనక భీంరావు అన్నారు. సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన గిరిజన దర్బార్‌లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గిరిజన ప్రజలు తమ సమస్యలను పరిష్కరించాలంటూ అర్జీలను సమర్పించారు.ఇంద్రవెల్లి మండలం దనోరా గ్రామానికి చెందిన జైరాంఅంగన్‌వాడీ కేంద్రానికి ప్రహరిగోడ మంజూరు చేయాలని, ఉట్నూర్ మండలం శ్యామ్‌నాయక్ తండా గ్రామానికి చెందిన జనబాయ్ తనకు ఉద్యోగం ఇప్పించాలని, ఇచ్చోడ గ్రామానికి చెందిన వంశీ తనకు ఆర్థిక సహాయం చేయాలని, వేమనపల్లి మండలం మంగణపల్లి గ్రామానికి చెందిన పార్వతి తనకి ఏదైనా ఆశ్రమ పాఠశాలలో ఉద్యోగం ఇప్పించాలని కోరారు. పింఛన్లు, రెండు పడక గదుల ఇండ్లు,ఆశ్రమ పాఠశాలలో ప్రవేశాలు, స్వయం ఉపాది పథకాల మంజూరు, వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలంటూ ప్రజలు దరఖాస్తులు సమర్పించారు. సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ గిరిజన దర్బార్‌లో ఏవో సున్నం రాంబాబు, ఎచ్‌వో సందీప్, జేడీఎం నాగభూషణం, ప్రిన్సిపాల్ మేస్రం మనోహర్, డీపీవో ప్రవీణ్, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఆదివాసీల అర్జీలు స్వీకరిస్తున్న ఏపీవో జనరల్ కెనక భీమ్రావు

అధికారులు జవాబుదారీగా పని చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో సుశీల్ రెడ్డి, పక్కన ఎంపీపీ అమృత జైసింగ్



సర్వసభ్య సమావేశానికి హాజరైన అధికారులు

మామడ, జూలై 1: మండల ప్రతీ ఒక్క అధికారి ప్రజలకు జవాబుదారీగా పని చేయాలని మామడ ఎంపీపీ అమృత జైసింగ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ప్రత్యేక అధికారులు గ్రామాల్లో పర్యటించి సమస్యలను తెలుసుకుని పరిష్కరించాలని ఎంపీపీ అమృత జైసింగ్, ఎంపీడీవో సుశీల్ రెడ్డిలు అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... వర్షాకాలంలో ప్రజలకు సీజనల్ వ్యాధుల నుంచి ఇబ్బందులు లేకుండా చూడాలని గ్రామాల్లో ప్రజా ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని తెలిపారు. ప్రజలు ఇంటి పరిసరాల్లో పరిశుభ్రతం పాటించి రోగాల బారిన పడకుండా ఉండాలని కోరారు. ఐదు సంవత్సరాల పదవి కాలం త్వరలో ముగియడంతో ఎంపీడీవో సిబ్బంది, ఎంపీటీసీ, జడ్పీటీసీలను సన్మానించారు. మెమెంటోను అందజేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ ఛైర్మన్ చిక్యాల హరీష్ రావు, వైస్ ఎంపీపీ ఏనుగు లింగారెడ్డి, ఎంపీటీసీలు సౌజన్య, పడాల శ్రీనివాస్, బొజ్జ రాధా, కోంద్ర భాగ్యలక్ష్మి రాజారెడ్డి, సౌజన్య రాజేశ్వర్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌పీవో రమేష్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

చాకలి ఐలమ్మ స్ఫూర్తితో ముందుకు వెళ్లాలి



చాకలి ఐలమ్మ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

బోథ్, జూలై 1: చాకలి ఐలమ్మ స్ఫూర్తితో రజకులందరూ ఐక్యంగా ముందుకు వెళ్లాలని బోథ్ శాసనసభ్యులు జాదవ్ అనిల్ పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన చాకలి ఐలమ్మ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాల్లో పాల్గొని ప్రసంగించారు. తెలంగాణ సాయుధపోరాటంలో ధైర్యంగా పోరాడిన వీర వనిత చాకలి ఐలమ్మ అన్నారు. ఆమె రజాకాలను ఎదిరించి భూమికోసం భుక్తి కోసం పోరాటం చేసిందన్నారు. అయితే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అయిన తరువాత పోరాట యోధులను పేర్లు బయటకు వచ్చాయన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో చాకలి ఐలమ్మ జయంతి వర్ధంతిలను అధికారికంగా నిర్వహించాలని ఆదేశించడంతో ప్రభుత్వం అధికారికంగా కార్యక్రమాలను చేపట్టడం జరిగిందన్నారు. ఎంతో మంది తెలంగాణ రాష్ట్రం కోసం పోరాడిన వాళ్ళ పేర్లు ఉమ్మడి రాష్ట్రంలో బయటకు రాలేదని రాష్ట్రం ఏర్పాటయ్యాక పోరాట యోధుల విగ్రహాలను వారు చేసిన పోరాటాల గురించి బయటకు వచ్చాయన్నారు. రజాకార్లకు ముప్పు తిప్పలు పెట్టిన ధీర వనిత ఐలమ్మ అన్ని వర్గాల ప్రజలకు ఆదర్శమూర్తి అన్నారు. అట్టడుగు వర్గాలను అభివృద్ధి చేయాలన్న నిర్ణయంతో చాకలి మంగళి వారి షాపులకు ఉచిత విద్యుత్‌ను ఇచ్చిన ఘనత మాజీ ముఖ్యమంత్రిదేనని అన్నారు. ఇప్పుడు విద్యుత్ బిల్లులను చదివించాలంటూ ప్రభుత్వం ఒత్తిడి తీసుకువస్తుందని వాపోయారు. అప్పట్లో బీసీ వర్గాలను ఆర్థికంగా అభివృద్ధి చేయాలన్న ధృక్పథంతో లక్షరూపాయల రుణం అందివ్వడం జరిగిందన్నారు. రజకులందరికీ తనవంతుగా భీమా సౌకర్యం కల్పించేందుకు ముందుకు రావడం జరుగుతుందన్నారు. జాబితా తనకు అప్పగిస్తే వారందరికీ ఇన్సురెన్స్ సౌకర్యం కల్పిస్తామన్నారు. వాగుల్లో బట్టలు ఉతికేందుకు వెళ్లి ఎంతో మంది ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని వారి కుటుంబాలలో భరోసా ఇచ్చేందుకు ఇన్సురెన్స్ సౌకర్యం కల్పిస్తామన్నారు. అంతేగాక మండల కేంద్రంలో రజకుల కోసం ఏర్పాటు చేసి ఇవ్వడం జరుగుతుందన్నారు. సమావేశంలో బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు చిక్కల దత్తు మాట్లాడుతూ రజకులందరికీ ప్రభుత్వపరంగా రెండు ఎకరాల భూమి అందే విధంగా కృషిచేయాలని ఎమ్మెల్యే విన్నవించారు. అన్ని మండల కేంద్రాల్లో చాకలి ఐలమ్మ విగ్రహాల ఏర్పాటుకు సహకారం అందించాలని కోరారు. సమావేశంలో జడ్పీటీసీ డాక్టర్ సంధ్యారాణి మాట్లాడుతూ ఐలమ్మ పోరాటాన్ని ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మాజీ సర్పంచ్ సురేందర్ యాదవ్ రజక సంఘం జిల్లా కార్యదర్శి కల్లాల శ్రీహరి, మాజీ వార్డు సభ్యులు లింగారెడ్డి, ఎంపీటీసీ మహేందర్, మాజీ ఉప సర్పంచ్ కట్ట పల్లవి, భూమేష్, రజక సంఘం మండల అధ్యక్షులు భోజన్న, దత్తన్నలతో పాటు సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అద్భుతం.. సిరిచెల్మ మల్లన్న ఆలయం



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎన్నికల వ్యయ పరిశీలకులు వివేకానంద్

ఇచ్చోడ, జూలై 1: అతి ప్రాచీన ఆలయం అద్భుతం సిరిచెల్మ మల్లన్న ఆలయం అని ఎన్నికల వ్యయ పరిశీలకులు వివేకానంద్ అన్నారు. సోమవారం ఇచ్చోడ మండలంలోని సిరిచెల్మ గ్రామ మల్లికార్జున ఆలయాన్ని దర్శించుకున్న ఆయన ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆదిలాబాద్ జిల్లాలోనే అతి ప్రాచీన శివాలయం గురించి తెలుసుకున్న ఆయన బోథ్ వెళ్లే క్రమంలో ఇచ్చోడ తహసీల్దార్ తుకారాంతో కలిసి సిరిచెల్మ మల్లన్నను దర్శించుకుని శివునికి అభిషేకం నిర్వహించారు. అనంతరం ఆలయం విశిష్టత, చరిత్ర తదితర వివరాలను స్థానికులకు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అక్కడి శిల్పసంపదను, ఆలయ నిర్మాణంను, చెరువు మధ్యలో వెలిసిన ఆలయం, ఆలయ నిర్మాణాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ హుస్సేన్, సిబ్బంది ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మొక్కలను నాటుతున్న ఉపాధి హామీ సిబ్బంది

మొక్కలను సంరక్షించే బాధ్యత ప్రతీ ఒక్కరిది

సారంగాపూర్, జూలై 1 : నాటిన మొక్కలను సంరక్షించే బాధ్యత ప్రతి ఒక్కరిదని ఎంపీడీవో లక్ష్మీ కాంతారావు అన్నారు. సోమవారం మండల కేంద్రంతో పాటు జాం, కౌట్ల(బి), స్వర్ణ, బీరవెల్లి, ధని, మలక్ చించోలి గ్రామాలతో పాటు ఆయా గ్రామాల్లో వన మహోత్సవంలో భాగంగా ఉపాధి హామీ కూలీలు, సంబంధిత అధికారులు మొక్కలను నాటి మొక్కల చుట్టూ కంచెను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ ఏపీవో లక్ష్మారెడ్డితో పాటు అటవీ శాఖ అధికారులు, ఉపాధి హామీ సిబ్బంది ఉన్నారు.

ఘనంగా డాక్టర్స్ డే వేడుకలు

భైంసా, జూలై 1 : పట్టణంలో సోమవారం డాక్టర్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని స్థానిక వికాస్ హైస్కూల్, గురుకృపా వొకేషనల్ కాలేజ్ విద్యార్థులు పట్టణ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ వైద్యులను ఘనంగా సన్మానించి జ్ఞాపికలను బహూకరించారు. వైద్యుల సేవలను గుర్తిస్తూ పలు కార్యక్రమాలు జరిగాయి.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉత్తమ వైద్యుడికి సన్మానం

నిర్మల్ అర్బన్, జూలై 1 : నిర్మల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలో చర్మ వ్యాధి నిపుణుడిగా పని చేస్తున్న డా. బిలకంటి అమరేశ్వర్‌ను నిర్మల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సన్మానం చేశారు. సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆయన చేస్తున్న సేవలకు గుర్తింపుగా శాలువా, మెమెంటోతో సత్కరించారు. నిర్మల్ జిల్లా ప్రజలకు స్పెషలిస్ట్ వైద్యుల సేవలు అందుబాటులోకి ఇలాంటి వైద్యులు ఇక్కడికి రావడం అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమం లో క్లబ్ ప్రతినిధులు రమణారెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, నేరెళ్ల హన్మంతు, డాక్టర్ కృష్ణం రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ గిరిజనులకు హైకోర్టు న్యాయవాది సహాయం

తలమడుగు , జూలై 1: తలమడుగు ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలంలోని మారుమూల గిరిజన గ్రామమైన మందగూడ గ్రామంలో హైకోర్టు న్యాయవాది ఆంగాజి కృష్ణ ప్రసాద్ సందర్శించి గిరిజనులకు సహాయ సహకారాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొద్ది రోజుల కింద భారీ వర్షానికి ఈదురు గాలికి చెట్లు ఇల్లుపై పడి భారీ నష్టానికి గురయ్యాయి. వీరికి సహాయంగా ఇంటిపైకి తాడిపత్రిలను అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గేడం నితీష్, కిరణ్, దినేష్, సాయి రాజ్ పాల్గొన్నారు.


మంత్రి సీతక్కకు వినతిపత్రం అందజేస్తున్న టీపీటీఎఫ్ నాయకులు

గిరిజన సంక్షేమ టీచర్ల బదిలీలు, పదోన్నతులను చేపట్టాలి : టీపీటీఎఫ్

ఉట్నూర్, జూలై 1: గిరిజన సంక్షేమ శాఖ ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు, భాషా పండితుల, వ్యాయామ ఉపాధ్యాయుల ఉన్నతీకరణ జీవో 317 అపీల్ను పరిష్కరించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆత్రం భుజంగరావు రాష్ట్ర మంత్రి సీతక్కను కోరారు. సోమవారం ఉట్నూర్ మండల పర్యటనకు వచ్చిన మంత్రి సీతక్కను కొమురంభీం ప్రాంగణంలో కలిసి టీపీటీఎఫ్ నాయకులు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆత్రంభుజంగరావు మాట్లాడుతూ గిరిజన సంక్షేమ శాఖలో కొన్నేళ్లుగా ఉపాధ్యాయులు బదిలీలు పదోన్నతులు లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. మీ సహకారంతో సవరించిన జీవో 16 విడుదల కావడం గర్వనీయమని అన్నారు. అయినా సీఎం పేషి నుంచి బదిలీలు, పదోన్నతుల ఫైలు బయటకు రాలేదన్నారు. 16ఏళ్లుగా గిరిజన సంక్షేమ శాఖ ఉపాధ్యాయుల బదిలీలు పదోన్నతులపై నిర్లక్ష్యం చేయడం సరైనది కాదన్నారు. ఆయన వెంట జిల్లా కార్యదర్శి ప్రధానకార్యదర్శి మరసుకోల జ్ఞానేశ్వర్, కనక వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి ప్రధాన కార్యదర్శి మరసుకోల జ్ఞానేశ్వర్, కనక వెంకటేశ్వరరావు, తదితరులు న్నారు.

ఐటీడీఏ అధికారులకు సీఆర్టీల నోటీసు

ఉట్నూర్, జూలై 1: ఉమ్మడి జిల్లాలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో కాంట్రాక్ట్ రెసిడెన్సి టీచర్లుగా పని చేస్తున్న వారి సమస్యల పరిష్కారం కోసం అధికారులు స్పందించకుంటే ఈ నెల 15న ఐటీడీఏ ముందు ధర్నా నిర్వహిస్తామని సీఆర్టీల సంఘం నాయకులు ఐటీడీఏ పరిపాలన అధికారి రాంబాబుకు ధర్నా నోటీసు అందించారు. గతనాలుగు నెలలుగా వేతనాలు రాక సీఆర్టీయూ ఇబ్బందులు గురవుతున్నారని పేర్కొన్నారు. ఈ నెల 14లోగా వేతనాల బడ్జెట్ విడుదల చేయక పోతే 15న ధర్నా చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రమేష్, వంశీ, సోమేశ్, దేవదాస్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ చైర్మన్ పదవిని అమ్ముకున్నారంటూ వీడియో వైరల్

ఆదిలాబాద్, జూలై 1(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని కాంగ్రెస్ నేతలు అమ్ముకున్నారంటూ ఓ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడం చర్చనీయాంశంగా మారింది. ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా కోరెడ్డికిషన్‌కు దక్కిందన్న ప్రచారం జరుగడంతో అదే పార్టీకి చెందిన నేత అవినీతి ఆరోపణలు చేయడం రాజకీయ వర్గాల్లో కలకలం రేపుతుంది. రూ.5లక్షలకు ఒప్పందం కుదుర్చుకుని ఇప్పటికే రూ.2లక్షలు తీసుకున్నారంటూ ఆరోపణలు వస్తున్నాయి. కిషన్‌కు చైర్మన్ పదవి ఇచ్చేందుకు కాంగ్రెస్ నేతలు ప్రయత్నిస్తున్నారని ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్కకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

నిజామాబాద్ ఎంపీకి ఎంపీ పరామర్శ

తలమడుగు, జూలై 1: ఉమ్మడి రాష్ట్ర మాజీ మంత్రి పీసీసీ అధ్యక్షులు ధర్మపురి శ్రీనివాస్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా వారి కుమారుడు నిజామాబాద్ ఎంపీ అరవింద్‌ను పరామర్శించిన ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్ వారి కుటుంబ సభ్యులు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అదే విధంగా డీఎస్ మృతి రాజకీయానికి తీరని లోటు అన్నారు. వారితో పాటు జిల్లా నాయకులు చంద్రకాంత్, తాంసి జడ్పీటీసీ రాజు వామన్ పటేల్, ఎంపీటీసీ రాజేష్, ఎక్స్ ఎంపీపీ అరుణ్‌కుమార్, సదానందం బొండ్ల వెంకట స్వామి, దాసు, తదితరులు పరామర్శించారు.

క్రాప్ లోన్‌ల పేరిట దందా

● ఆదిలాబాద్ జిల్లాలో లోన్‌ల కోసం బ్యాంకులకు వచ్చే రైతులపై దళారుల వల ● రూ.లక్షకు రూ.10 వేల వరకు వడ్డీ వసూలు ● ఆర్థికంగా నష్టపోతున్న అన్నదాతలు ● ఆదివాసీ రైతులే వీరి టార్గెట్

ఆదిలాబాద్ రూరల్, జూలై 1: బ్యాంకుల్లో లోన్‌లు తీసుకోవాలంటే పాత లోన్ చెల్లించాలి. ఈ లోన్‌ను చెల్లించేందుకు రైతులు నానా అవస్థలు పడుతున్నారు. లోన్ల చెల్లింపులకు డబ్బులు లేక దళారులను ఆశ్రయిస్తున్నారు. చేతిలో చిల్లి గవ్వలేని రైతులు వ్యాపారస్తులు, దళారులను ఆశ్రయించి మోసపోతున్నారు. 1, 2 రోజుల వ్యవధికే రూ.లక్షకు రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు వడ్డీ వసూలు చేస్తూ రైతుల నడ్డి విరుస్తున్నారు. ఈ తతంగం ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా సాగుతోంది. కాగా ఆదిలాబాద్ రూరల్ మండలంలోని అంకోలి, యాపల్‌గూడ తదితర గ్రామాల్లోని బ్యాంకుల్లో సహా ఇతర ప్రాంతాల్లోని ఆయా బ్యాంకుల శాఖలలో కూడా ఈ వ్యవహారం కొనసాగుతోంది. రైతులు బ్యాంకుల్లో తీసుకున్న రుణాలను కేటాయించిన సమయంలో రీషెడ్యూలు చేయాలి. ఇదే అదునుగా భావించిన దళారులు బ్యాంకుల వద్ద పాగా వేసి సరికొత్త వడ్డీ వ్యాపారానికి తెరలేపారు. బ్యాంకర్లకు ఈ దందా గురించి తెలిసినా.. లోన్ల లక్ష్యం పూర్తి చేసేందుకు చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. కొంత మంది బ్యాంకు అధికారులు సైతం పరోక్షంగా ఈ బ్రోకర్లకు (దళారులకు) సహకరిస్తున్నారు.


అంకోలిని తెలంగాణ గ్రామీణ బ్యాంక్

● **రైతుల అవసరాలే.. ఆసరాగా!!**

ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే వర్షాలు కురుస్తుండడంతో సాగు పనులు జోరుగా సాగుతున్నాయి. అన్నదాతలు పెట్టుబడి నిమిత్తం లోన్ల కోసం బ్యాంకులకు పరుగులు పెడుతున్నారు. పాత లోన్ చెల్లిస్తే రెండు రోజుల్లో కొత్త లోన్ మంజూరు చేస్తామని అధికారులు సూచిస్తున్నారు. బ్యాకుల వద్ద పాగా వేసిన దళారులు ఆదివాసీ, పేద రైతులను మచ్చిక చేసుకుని లోన్లు చెల్లించేందుకు కావాల్సిన డబ్బు సమకూరుస్తున్నారు. లోన్ మంజూరయ్యాక రూ.లక్షకు రూ.5 వేల నుంచి రూ.10 వేల చొప్పున దళారుల చేతిలో మోసపోతున్నారు.


బ్యాంకులో లావాదేవీలు జరుపుతున్న రైతులు

● **దళారులతో అధికారుల మిలాఖాత్?**

దళారులు బ్యాంకు అధికారులు, సిబ్బందితో లోపాయికారి ఒప్పందాలు చేసుకుంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. రుణాల రీషెడ్యూల్ కోసం వచ్చే రైతుల వివరాలు వారికి చేరవేస్తున్నారు. అప్పు చెల్లించేందుకు ఇబ్బంది పడుతున్న వారి గురించి తెలుసుకుని దళారులకు చెబుతున్నారు. దళారులు నేరుగా ఆయా రైతుల వద్దకు వెళ్లి డీల్ కుదుర్చుకుంటున్నారు. గత్యంతరం లేని రైతులు దళారులు చెప్పిన వడ్డీ ఇవ్వడానికి సిద్ధపడుతున్నారు.

● **దళారీల వ్యవస్థ ఉండొద్దు : కె.సతీష్, అంకోలి గ్రామం, ఆదిలాబాద్ రూరల్**



ప్రభుత్వాలు ఎన్ని మారిన, ఎన్ని పథకాలు వచ్చినా, పంటలు ఎన్ని వచ్చిన కూడా గిట్టుబాటు ధరలు లేకపోవడంతో రైతుల పరిస్థితుల్లో మార్పు ఉండడం లేదు. దీంతో బ్యాంకుల్లో పంట రుణాలు చెల్లించే సమయంలో రైతుల వద్ద డబ్బులు లేక దళారుల వద్ద నుంచి అధిక వడ్డీలకు డబ్బులు తీసుకోవాల్సి వస్తుంది. బ్యాంకుకు రుణం చేతికందే 2 నుంచి 3 రోజుల కోసమే రైతు దాదాపు ఏడాది వడ్డీ చెల్లిస్తున్నారు. ఈ విషయం బ్యాంకు వారికి తెలిసిన చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారు. ఉన్నతాధికారులు దళారులపై చర్యలు తీసుకుంటే బాగుంటది.

● **దోచుకుంటున్నారు : లంకా రాఘవులు, వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి**



బ్యాంకుల వద్ద ఉంటూ రైతులను దోచుకుంటున్న దళారులపై అధికారులు చర్యలు తీసుకోవాలి. రైతులకు అధిక వడ్డీలు వేస్తూ వారిని నిలువు దోపిడీ చేస్తున్నారు. వారిపై అధికారులు నిఘా పెట్టాలి. ప్రభుత్వం రుణాలను ఆటో రీ షెడ్యూలు చేయాలి. బ్యాంకుల వద్ద చాలా మంది రైతులు మోసపోతున్నారు. కొంత మంది అధికారులు దళారులకు వత్తాసు పలుకుతున్నారు.

ప్రతీ మొక్కను కాపాడాలి : ఎంపీడీవో

తాంసి, జూలై 1: నాటిన ప్రతీ మొక్కను కాపాడే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎంపీడీవో గడ్డం మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని పొన్నారి, హస్నాపూర్ గ్రామాలలో ఉపాధి కూలీలు నాటిన మొక్కలను ఆయన పరిశీలించారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా మొక్కలు నాటాలని సూచించారు. ముఖ్యంగా విద్యుత్ లైన్ల కింద మొక్కలు నాటవద్దని వివరించారు. ముఖ్యంగా గ్రామాలలోని యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. ప్రతీఒక్కరు తమవంతుగా కనీసం మూడు మొక్కలు పెంచి పోశించాలని అప్పుడే వాతావరణంలోని కాలుష్యాన్ని కాపాడగలిగిన వారం అవుతామని అన్న విషయాన్ని గ్రహించాలని కోరారు.

'వైద్య వృత్తి ఎంతో విలువతో కూడింది'

బోథ్, జూలై 1: సమాజంలో వైద్య వృత్తి ఎంతో ఉత్తమమైందని ఆ వృత్తిలో ఉన్న వారికి సమాజం సముచితమైన గౌరవం ఇస్తుందని నాగభూషణం పాఠశాల ప్రిన్సిపాల్ కిషోర్‌కుమార్ పేర్కొన్నారు. వైద్యుల దినోత్సవం పురస్కరించుకుని సోమవారం మండల కేంద్రంలో డాక్టర్ శైలజ ప్రభుత్వ వైద్యురాలు ఎం.విశ్వనాథ్, ఆర్ఎంపీ వైద్యులను డాక్టర్స్ దినోత్సవం పురస్కరించుకుని సన్మానించారు.



రోడ్లపై తిరిగే పశువులను కట్టడి చేయాలి

బోథ్, జూలై 1: మండల కేంద్రంలో రోడ్లపై తిరిగే పశువులను కట్టడి చేయాలని స్థానిక రైతులు సోమవారం ఎంపీడీవో రమేష్‌కు వినతిపత్రం అందించారు. పశువుల సంచారం వల్ల గ్రామంలో ఇబ్బందులు పెరగడంతో పాటు గ్రామం సమీపంలో ఉన్న పంట పొలాల్లో తిరిగి పంటలు నాశనం చేస్తున్నాయని రైతులు వాపోయారు. అంతకుముందు గ్రామ పంచాయితీ కార్యాలయానికి వెళ్లి అక్కడ ఉన్న సిబ్బందికి వినతిపత్రం ఇచ్చారు. అందించిన వారిలో మాజీ వార్డు సభ్యులు లింగారెడ్డి, సామాజిక సేవకుడు జక్కుల వెంకటేష్, రైతులు కిషోర్‌రెడ్డి, సుభాష్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

'హైదరాబాద్‌కు బస్సు సౌకర్యం కల్పించాలి'

బజార్‌హత్నూర్, జూలై 1: బజార్‌హత్నూర్ మండలకేంద్రం నుంచి హైదరాబాద్ వరకు, అలాగే సొనాల మీదుగా నిర్మల్ వరకు బస్సులను నడపాలని డిపో మేనజర్‌కు కాంగ్రెస్ కిసాన్ సెల్ మాజీ సభ్యుడు ఇర్ల శివుడు వినతిపత్రాన్ని అందించారు. మండలకేంద్రంలో సోమవారం ఈ విషయమై ఆయన మాట్లాడుతూ గతంలో మండలకేంద్రం నుంచి హైదరాబాద్‌కు ఆర్టీసీ బస్సు నిత్యం నడిపేవారు. ఏవో కారణాల వలన ప్రస్తుతం బస్సును నడపడం లేదు. కేవలం ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న సొనాల గ్రామం నుంచి హైదరాబాద్ వరకు నిత్యం ఆర్టీసీ బస్సును నడుపుతున్నారు. మండలవాసులు హైదరబాదుకు వెళ్లాలంటే సొనాల లేదా ఇచ్చోడ వరకు వెళ్లాల్సిందే. ఈ సమయంలో ప్రైవేటు వాహణాలలో మాత్రమే వెళ్లాల్సి వస్తుందని మండవాసులు పేర్కొన్నారు. కొన్ని సమయాలలో ఆలస్యం కావడం వలన బస్సు మిస్సైనా సంధర్బాలు కూడా ఉన్నాయన్నారు. ఉన్నత విధ్యను అబ్యసించేందుకు ఎందరో విద్యార్థులు, అత్యుత్తమ వైద్య సేవల కోసం రోగులు, వ్యాపారస్తులు ఇలా ప్రతీ రంగంవారు ఎందరో మండలం నుంచి హైదరాబాదుకు నిత్యం ప్రయాణిస్తున్నారు. కావున మండలకేంద్రం నుంచి వెంటనే ఆర్టీసీ సిబ్బంది సొనాల వరకు వచ్చే బస్సును బజార్‌హత్నూర్ నుంచి నడపాలని కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ రాష్ట్ర సభ్యులు ఇర్ల శివుడు ఆర్టీసీ అధికారులను కోరారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి


మొక్కలు నాటుతున్న ఎంపీపీ కవిత గోవింద్

పెంబి రూరల్, జూలై 1: ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పెంబి ఎంపీపీ కవిత గోవింద్ అన్నారు. సోమవారం వన మహోత్సవం కార్య క్రమంలో భాగంగా పెంబి, మందపల్లి తదితర గ్రామాల్లో మొక్కలు నాటారు. పెంబి మండల కేంద్రంలోని బాలికల ఆశ్రమ పాఠశాలలో ఎంపీపీ కవిత గోవిం ద్ పాల్గొని విద్యార్థులతో అధికారులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సంద ర్భంగా ఆమె మాట్లాడుతూ... మానవ మనుగడకు చెట్లు ఎంతో అవ సరమని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. ఈ కార్య క్రమంలో ఎంపీపీ కోఆప్షన్ అబ్దుల్ మతిన్, ఎంపీడీవో రమాకాంత్, ఎంపీవో రత్నాకర్ రావు, ఏపీవో రాజశేఖర్, పంచాయతీ కార్యదర్శి అనిల్, ఫీల్డ్ అసిస్టెంట్ గోపి, తదితరులు ఉన్నారు.

కాలుష్య నివారణకు మొక్కలు నాటాలి


మొక్కలు నాటుతున్న అధికారులు

కుంటాల, జూలై, 1 : ప్రతి ఒక్కరు మొక్కలు వాటిని సంరక్షించాలని ఎంపీపీ అప్క గజ్జారాం యాదవ్, ఏడీఏ వీణ, ఎంపీడీవో రహీంలు అన్నారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా సోమవారం మండల కేంద్రం కుంటాల మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మొక్కలు నాటి, నాటిన ప్రతి మొక్కను సంరక్షించుకోవాలని, మానవ మనుగడకు మొక్కలు ఎంతో అవసరమని, వాతావరణంలో కాలుష్యం నివారణకు వర్షాలు సమృద్ధిగా కురియాలన్న మొక్కలు ఎంతో అవసరమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి సోమలింగా రెడ్డి, మండల ఉపాధ్యక్షురాలు పసుల మౌనిక నవీన్, ఏపీవో నవీన్, తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యే హరీష్‌బాబుకు సన్మానం

కాగజ్‌నగర్, జూలై 1: హైదరాబాద్‌లోని లక్డీకాపుల్ వద్ద ఐఎంఏ ఆధ్వర్యంలో జరిగిన డాక్టర్స్ డే వేడుకల్లో సోమవారం ఎమ్మెల్యే డాక్టర్ హరీష్‌బాబును సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఐఎంఏసిబ్బంది పాల్గొన్నారు.



ఎమ్మెల్యే హరీష్‌బాబును సన్మానిస్తున్న దాక్టర్లు

సోయాకు ఆకుదశలోనే కలుపుమందు వాడుకోవాలి

కుభీర్, జూలై 1 : మండలంలోని హంపోలిలో సోమవారం ఏఈవో నారాయణ క్షేత్రస్థాయిలో సోయాబీన్ పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు పలు సూచనలు అందజేశారు. సోయాబీన్ 2 నుంచి 4 ఆకుల దశలో కలుపు మందు వాడుకుంటే సమర్థవంతంగా పని చేస్తుందని అన్నారు. దీని కొరకు గడ్డిజాతి మొక్కలు వుంటే టార్గాసూపర్ 400ఎంఎల్ లేదా ఏజిల్ 250ఎంఎల్ ఒక ఎకరానికి వాడి నివారించవచ్చునని తెలిపారు. అలాగే వెడల్పు ఆకు గల మొక్కలు ఉంటే ఇమాజీతాపర్ 400ఎంఎల్ ఎకరానికి వాడికి నివారించవచ్చునని తెలిపారు. అలాగే తొలి దశలో ఏవైనా ఆకుమచ్చలు వచ్చినలో లీటర్ నీటికి ఒక గ్రామ్ స్ప్రే చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతులు నారాయణ్‌రావుపటేల్, తదితరులున్నారు.


పంటను పరిశీలిస్తున్న ఏఈవో నారాయణ

కలెక్టరేట్ ఎదుట ఎమ్మెల్యే కోవ లక్ష్మి ధర్నా


● ప్రొటోకాల్ పాటించాలని డిమాండ్

ఆసిఫాబాద్, జూలై 1: జిల్లాలో నిర్వహించే వివిధరకాల అభివృద్ధి కార్యక్రమాలకు ప్రొటోకాల్ లేని కాంగ్రెస్ నాయకులను అనుమతించవద్దని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. ఆదివారం మంత్రి సీతక్క పర్యటనలో జిల్లాలోని రెబ్బెన మండలకేంద్రంలో ప్రొటోకాల్ పాటించకపోవడంపై జిల్లాకేంద్రంలో పార్టీశ్రేణులతో కలిసి కలెక్టరేట్‌ఎదుట ఆమె ధర్నా నిర్వహించారు. అనంతరం అదనపు కలెక్టర్ దాసరి వేణు, ఆర్డీవో లోకేశ్వర్‌రావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మంత్రి అధికారిక కార్యక్రమాల్లో ప్రొటోకాల్ పాటించకపోవడం ఏమిటని ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకులు వారి పార్టీ కార్యక్రమాల వల్లే అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నా రని ఆరోపించారు. జిల్లా అభివృద్ధి చేయడం ఆహ్వానంచదగ్గదే అయినప్పటికీ ఒక ఆదివాసీ ఎమ్మెల్యేగా తమకు గుర్తింపు ఇవ్వక పోవడం ఏమిటని ఆవేదన వ్యక్తం చేశారు. సాటి ఆదివాసి మంత్రికి కూడా ఇంత చిన్న విషయం తెలియదా అని ప్రశ్నించారు. తమపార్టీ కార్యకర్తలను ఆదివారం రెబ్బెన పర్యటనలో కాంగ్రెస్ నాయకులు ఇష్టం వచ్చినట్లు మాట్లాడారని అన్నారు. తమను రాజకీయంగా ఎదుర్కొలేక ఇటువంటి కుతంత్రాలు పన్నుతున్నారని ఆరోపించారు. భవిష్యత్‌లో ఇలాంటివి పునరావృతమైతే ఊర్కొనేది లేదన్నారు. తానుపార్టీ మారుతున్నట్లు కాంగ్రెస్ నాయకులు అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారన్నారు. రాజకీయాల్లో ఉన్నన్ని రోజులు కేసీఆర్‌తోనే ఉంటానని పునరుద్ఘాటించారు. ప్రతిపక్షంలో ఉంటూ ప్రజాసమస్యలపై నిరంతరం పోరాటం చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీలు అజయ్‌కుమార్, ద్రుపతాబాయి, అరుణ, ఎంపీపీలు సౌందర్య, భాగ్యలక్ష్మి, పీఏసీఎస్ చైర్మన్ అలీబీన్‌అహ్మద్, సరస్వతీ, రవీందర్, లాలా, భీమేష్, తదితరులు పాల్గొన్నారు.


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి, బీఆర్ఎస్ నాయకులు

తల్లీ, ముగ్గురు కూతుళ్ల ఆత్మహత్యాయత్నం

● ఇద్దరు కూతుళ్ల పరిస్థితి విషమం


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కూతుళ్లు

కాగజ్‌నగర్, జూలై 1: తాగుడుకు బానిసైన భర్త.. నిత్యం వేధింస్తుండటంతో భరించలేక ముగ్గురు కూతుళ్లతో సహా ఓతల్లి పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వివరాల్లోకి వెళితే.. కుమరంభీం ఆసిఫా బాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలం గజ్జిగూడలో చిలుకూరి ప్రతాప్, భార్య అనిత, పిల్లలతో కలిసి నివాసం ఉంటున్నాడు. ప్రతాప్ ప్రతిరోజు తాగి భార్యతో గొడవపడుతుండే వాడు. సోమవారం ఉదయం కూడా గొడవజరగటంతో జీవితంపై విరక్తి చెందిన అనిత(55), సాయంత్రం కూతుళ్ల లక్ష్మి(21), రమ్య(16), ఐశ్వర్య (14)ను తీసుకొని పొలానికి కెళ్లింది. అక్కడపొలంలో ఉన్న పురుగుల మందు ను ముగ్గురు తాగారు. ఇంతలో అపస్మారకస్థితిలో పడిఉన్న వారి అక్కడ పనిచేస్తున్న కూలీలు గమనించి హుటాహుటిన కాగజ్‌నగర్‌లోని ఓ ఆసుపత్రికి తీసుకెళ్లారు. నలుగురికి వైద్యచికిత్సలు అందించారు. కాగా, లక్ష్మి, రమ్య పరిస్థితి విషమంగా ఉన్నట్టు డాక్టర్లు పేర్కొన్నారు. ఈ విషయమై సీఐ అల్లం రాంబాబును వివరణ కోరగా గజ్జిగూడకు చెందిన ప్రతాప్ భార్యతో తరుచూ గొడవపడుతుండే వాడని, తీవ్రమనోవ్యధకు గురైన భార్య అనిత, కూతుళ్లతో సహా ఆత్మహత్య యత్నానికి ఒడిగట్టినట్లు వివరించారు. ప్రసాద్‌పై గతంలో కూడా కేసులున్నట్టు వివరించారు. ఇటీవలపై బెయిల్‌పై వచ్చినట్టు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసి ప్రతాప్‌ను అదుపులోకి తీసుకున్నట్టు తెలిపారు.

ముగ్గురిపై అట్రాసిటీ కేసు నమోదు

దహెగాం, జూలై 1: మండలంలోని హత్తిని గ్రామానికి చెందిన చాపెల వెంకటేష్‌ను కులం పేరుతో దూషించిన అదే గ్రామానికి చెందిన ముగ్గురిపై సోమవారం అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజు తెలిపారు.


రైతు అభిప్రాయ సేకరణ సమావేశానికి హాజరైన రైతులు

10 ఎకరాల వరకు ఉన్న రైతులకు రైతు భరోసా వర్తింపజేయాలి

లక్ష్మణచాంద, జూలై 1 : 10 ఎకరాలోపు సాగు భూమి కలిగిన రైతులందరికీ రైతు భరోసా వర్తింపజేయాలని పీఏసీఎస్ ప్రత్యేక మహాజన సభలో సోమవారం తీర్మానించారు. రైతు భరోసా వర్తింపజేయటంపై పీఏసీఎస్ అధ్యక్షులు, డీసీసీబీ వైస్ ఛైర్మన్ రఘునందన్‌రెడ్డి అధ్యక్షతన మండల కేంద్రంలోని రైతు వేదికలో జరిగిన రైతు అభిప్రాయ సేకరణ సమావేశంలో చర్చించారు. పలువురి అభిప్రాయాలు స్వీకరించిన అనంతరం పై విధంగా తీర్మానించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ డిప్యూటీ రిజిస్ట్రార్ జే. నర్సయ్య, ఏడీసీసీ మేనేజర్ శిరీష్, పీఏసీఎస్ సీఈవో ఉదయ్, పీఏసీఎస్ డైరెక్టర్స్, రైతులు పాల్గొన్నారు.

మహిళలు సమస్యలపై నిర్భయంగా సంప్రదించాలి

ఆసిఫాబాద్, జూలై 1: జిల్లాలోని మహిళలు, యువతులు ఎలాంటి సమస్యలు ఉన్నా నిర్భయంగా పోలీసులను సంప్రదిం చవచ్చని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు పేర్కొన్నారు. మహిళల రక్షణ కోసం షీ టీం, యాంటి ఉమెన్ ట్రాఫికింగ్ టీంలు పనిచేస్తున్నాయన్నారు. విద్యార్థినులు, మహిళలు అన్యాయా నికి గురైనప్పుడు భయపడొద్దని, ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేస్తే నిందితులపై చర్యలు తీసుకుంటామన్నారు. జూన్‌నెలలో షీటీంద్వారా 60 హాట్‌స్పాట్ ప్రదేశాలను గుర్తించామని, 16అవేర్నెస్ ప్రోగ్రాంలు నిర్వహించామ న్నారు. ఒక కేసులో కౌన్సెలింగ్ చేశామన్నారు. ఎలాంటి సమస్యలు ఉన్నా 8712670564, డయల్ 100కు సమాచారం అందించాలన్నారు.

ప్రొటోకాల్‌ను విస్మరించవద్దు

ఆసిఫాబాద్ రూరల్, జూలై 1: ప్రజాప్రతినిధులను అధికారిక కార్యక్రమాలకు ఆహ్వానించాలని ప్రొటోకాల్‌ను అధికారులు విస్మరించవద్దని జడ్పీటీసీల ఫోరం అధ్యక్షుడు అరిగెల నాగేశ్వర్‌రావు అన్నారు. సోమవారం ఎంపీపీ మల్లి కార్జున్‌తో కలిసి ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆధీనంలో చేపట్టే ప్రారంభోత్సవం, శంకుస్థాపనలకు స్థానిక ప్రజాప్రతినిధులతోపాటు ఎమ్మెల్యేను గౌరవప్రదంగా ఆహ్వానించాలని అన్నారు. ప్రభుత్వపరంగా చేపట్టే కార్యక్రమాలకు పార్టీజెండాలను, ఫ్లెక్సీలను ఏర్పాటు చేయడం సబబుకాదని హితవులు పలికారు. ప్రోటోకాల్‌పై కలెక్టర్ సంబంధిత శాఖ అధికారులకు ఆదేశాలు జారీచేయాలని కోరారు. ఆదివారం రెబ్బెనలో జరిగిన సంఘటన పునరావృతంకాకుండా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. అధికార కార్యక్రమాలకు పార్టీ తోరణాలు కానీ, జెండాలుకానీ ఏర్పాటుచేస్తే శాఖాపరమైన చర్యలుతీసు కోవాలని కోరారు. అధికారపార్టీ నాయకులు ఏకపక్షంగా వ్యవహరించడం సరికాదన్నారు.

మీ సేవ కేంద్రాన్ని ప్రారంభించిన తహసీల్దార్

జైనూర్, జూలై 1: మండల కేంద్రంలో మీ సేవాకేంద్రాన్ని ఇన్‌చార్జీ తహసీ ల్దార్ బీర్షావ్ సోమవారం ప్రారంభించారు. ఈసందర్భంగా మీసేవా కేంద్రంలో ఆన్‌లైన్ సేవల్ని పరిశీలిం చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు ప్రభుత్వ నిబంధనలకు అనుసారంగా సేవలందిం చాలని కోరారు. ఆదివాసీ నాయకులు దుర్వె సుభాష్, జనార్దన్, ఇస్రు, పెందూర్ ప్రకాష్ తదితరులు ఉన్నారు.





- ప్రతీ ఏటా వానాకాలంలో ముంపునకు గురవుతున్న జిల్లా కేంద్రంలోని లోతట్టు ప్రాంతాలు
- అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ప్రతిపాదనలు కాగితాలకే పరిమితం
- ప్రమాదపుటంచులో స్వర్ణ వాగు, ఔళినాలా పరివాహక ప్రాంతాలు

కందకాల కబ్జాతో.. వరద గండం

నిర్మల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రమైన చారిత్రక నిర్మల్ పట్టణాన్ని ప్రతీఏటా వర్షాకాలం వణికిస్తోంది. ముఖ్యంగా నిర్మల్‌లోని అనేక చారిత్రక కందకాలు, నాలాలు, చెరువు భూములు కబ్జాకు గురవుతుండటంతోనే ప్రతీఏటా వరదనీరు పట్టణంలో బీభత్సం సృష్టిస్తోంది. గంటపాటు ఏకధాటిగా వర్షం పడితే చాలు నిర్మల్ పట్టణమంతా జలమయమై పోతోంది. మురికివాడలతో పాటు ఆధునికంగా కట్టిన కాలనీలు అలాగే హైవే ప్రధాన చౌరస్తాలు వర్షాకాలంలో వాననీటితో చెలగాటమాడుతుండడం సహజంగా మారిపోయింది. జిల్లా కేంద్రం చుట్టూరా ఉన్న గొలుసుకట్టు చెరువులతో పాటు వాటికి ఆనుకొని ఉన్న కందకాలు, అలాగే ప్రధాన నాలాలను ఆక్రమణదారులు పూడ్చి వేయడంతో ప్రస్తుతం అవి చిన్న మురికి కాలువలుగా మారిపోయాయి. దీంతో వర్షాకాలంలో ఎగువ నుంచి వచ్చే వరదనీటి ప్రవాహం కారణంగా ఈ మురికి కాలువలన్నీ నిండిపోయి నీరంతా రోడ్లపైనే కాకుండా ఇళ్లలోకి కూడా ప్రవేశిస్తోంది. వర్షాకాలంలో నిర్మల్ పట్టణం ఎటు చూసినా జలమయంగా మారిపోతోంది. నిర్మల్‌లోని సిద్ధాపూర్ వరకు ప్రవహించే స్వర్ణ కాలువ పరివాహకంలో ఉన్న జీఎన్‌ఆర్ కాలనీ వాసులు వర్షాకాలం పేరెత్తితేనే గడగడలాడిపోతున్నారు. గత సంవత్సరం స్వర్ణప్రాజెక్టు గేట్లను ఎలాంటి హెచ్చరికలు లేకుండా ఎత్తేయడంతో ప్రాజెక్టు వరద నీరంతా ఈ కాలనీని ముంచెత్తింది. దాదాపు పదిరోజుల పాటు ఈ కాలనీ జలమయమైపోయిన విషయం తెలిసిందే. ప్రజలను వరద నీటి నుంచి కాపాడేందుకు పట్టణ ప్రజలు, అధికార యంత్రాంగమంతా శ్రమించాల్సి వచ్చింది. నీళ్లలో చిక్కుకుపోయిన ప్రజలను నాటు పడవలతో సురక్షిత ప్రాంతానికి తీసుకువచ్చారు. ఇళ్లల్లో విలువైన వస్తువులన్నీ వరదనీటిలో కొట్టుకుపోయాయి. దీంతోపాటు ఇళ్లల్లో వరద నీటికారణంగా ఇసుక మేటలు వేయడంతో చాలా ఇళ్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. అలాగే నిర్మల్ పట్టణంలోని పాత బస్తీ గుండా ప్రవహించే జౌళినాలా కాలువ కూడా ఆక్రమణలకు గురికావడం, అలాగే ఈ కాలువను ఎప్పటికప్పుడు శుభ్రం చేయకపోతుండడంతో పాతబస్తీ వాసులకు ప్రాణసంకటంగా మారుతోంది. దీంతోపాటు ఈ కాలువకు ఆనుకొని నివసిస్తున్న వారంతా క్రమంగా ఈ కాలువను ఆక్రమించడంతో దాని పరిమాణపు రూపురేఖలు మారిపోయాయి. ప్రతీఏటా వర్షాకాలంలో జౌళినాలా పొంగిపొర్లుతుండడం సాధారణమైపోయింది. దీని కారణంగా రామారావుబాగ్, బెస్తవార్‌పేట్, కాల్వగడ్డ, రాంమందిర్, షేక్‌సాబ్‌పేట్, కురన్నపేట్ ముంపునకు గురవుతున్నాయి. ధర్మసాగర్ చెరువు ఆక్రమణకు గురికావడమే కాకుండా దాని కింది ప్రాంతంలో పంట పొలాలు అన్నీ కనుమరుగైపోవడం, ఇళ్ల నిర్మాణాలు పెద్ద ఎత్తున జరగడంతో ప్రియదర్శినినగర్, మస్తాన్‌దుబ్బా, మంజులాపూర్ వార్డులు వర్షాకాలంలో వరదనీటితో ముంపునకు గురవుతున్నాయి. వర్షాకాలంలో ప్రతీఏటా ప్రియదర్శినినగర్‌లో దాదాపు మోకాళ్ల లోతుల్లోకి వరదనీరు ప్రవహించడంతో జనమంతా ఇళ్లకే పరితమైపోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. అలాగే కంచరోని చెరువు కింద ఉన్న విద్యానగర్, ఆదర్శనగర్‌లు కూడా ప్రతీ వర్షాకాలంలో ముంపు బారిన పడుతున్నాయి. నిర్మల్‌లోని ప్రధాన కందకం ఆక్రమణకు గురికావడంతో ఇందిరానగర్, శాస్త్రినగర్, రవినగర్‌లు వర్షం నీటితో సతమతమవుతున్నాయి. అలాగే డాక్టర్స్‌లేన్ ప్రాంతం ప్రధానరోడ్డు నీట మునిగిపోతోంది. దీంతోపాటు పల్లెచెరువు, గండిరామన్న గుట్టల ప్రాంతం నుంచి ప్రవహించే వరదనీటి కారణంగా విశ్వనాథ్‌పేట్, గాజులపేట్, వైఎస్‌ఆర్ కాలనీలు వరదనీటితో ముంపు పాలవుతున్నాయి. ముఖ్యంగా కందకాలు, చెరువులు, కాలువల కబ్జాల కారణంగానే వాటి రూపురేఖలు మారిపోయాయి. వరదనీటి ప్రవాహనం రోడ్లపైన, ఇళ్లల్లోకి చేరుకొని వారం పదిరోజులపాటు జనాన్ని సతమతం చేస్తోంది. అయితే ఇప్పటి వరకు సంబంధిత అధికారులు మాత్రం శాశ్వత ప్రాతిపదికన వరద నీటి ముంపు నుంచి పట్టణాన్ని కాపాడేందుకు పకడ్బందీ ప్రణాళిక రూపొందించలేదన్న ఆరోపణలున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం సైతం పట్టణ ప్రాంతాల్లో వర్షాల కారణంగా వరద నీటి నుండి ప్రజలను కాపాడేందుకు ఇప్పటి వరకు పకడ్బందీ ప్రణాళిక రూపొందించలేదన్న విమర్శలు ఉన్నాయి.

వెంటాడుతున్న జీఎన్‌ఆర్ కాలనీ చీకటి స్మృతులు

నిర్మల్ పట్టణంలో సిద్దాపూర్ స్వర్ణవాగుకు ఆనుకొని ఉన్న జీఎన్‌ఆర్ కాలనీ రెండేళ్ల క్రితం అప్పటి వర్షాకాలంలో పూర్తిగా మునిగిపోయింది. స్వర్ణప్రాజెక్టు గేట్లు ఎత్తివేయడంతో ఈ వాగు గుండా ప్రవహించే నీరంతా జీఎన్‌ఆర్ కాలనీని ముంచేసింది. వరద ప్రవాహంలో విలువైన వస్తువులు, ఆస్తులు కొట్టుకుపోయాయి. రాత్రి నుంచి ఉదయం వరకు ఈ కాలనీ వాసులంతా ఇళ్లపైకి చేరుకొని తమ ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని భయం భయంగా గడిపారు. సమాచారం తెలుసుకున్న స్థానికులు, ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగం అంతా 12 గంటల పాటు శ్రమించి ఈ వరదనీటి నుంచి కాలనీ వాసులను కాపాడగలిగారు. దాదాపు పదిరోజులపాటు ఈ కాలనీ అంతా నీటిలో మునిగింది. పదిహేను రోజుల తర్వాత తేరుకున్న ఈ కాలనీలోని ఇళ్లల్లో బురద మేటలు వేశాయి. దీంతో ఇళ్ల మరమ్మతులు చేయించుకోలేక స్థానికులు తీవ్ర ఇబ్బందుల పాలయ్యారు. గతంలో ఎప్పుడూ కూడా ఇలాంటి సంఘటనలు జరగకపోవడంతో పట్టణ వాసులు అంతా జీఎన్‌ఆర్ కాలనీ అంటేనే జంకుతున్నారు. ఈసారి కూడా వర్షాకాలంలో చాలా మంది ఈ కాలనీ వాసులు ఇళ్లల్లో ఉండేందుకు వెనకాడుతున్నారు. వర్షాకాలం పూర్తయ్యే వరకు తమ బంధువుల ఇళ్లల్లో గానీ ఇతర చోట్ల అద్దెకు ఉండేందుకు సిద్ధమవుతున్నారని అంటున్నారు.

అటకెక్కిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ప్రతిపాదన

కాగా అప్పటి మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి ఎంపీగా ఉన్న సమయంలో నిర్మల్‌లో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందింపజేశారు. దాదాపు 60 కోట్ల రూపాయలతో రూపొందించిన ఈ ప్రతిపాదనలను అప్పటి కేంద్ర ప్రభుత్వానికి అందించారు. ఈ ప్రతిపాదనలను పరిశీలించేందుకు అప్పట్లో మున్సిపల్ అధికారులతో కమిటీని కూడా నియమించారు. అయితే నిధుల కొరత కారణంగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ప్రతిపాదనలు అటకెక్కాయి. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఈ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ప్రతిపాదనలు కేవలం నాయకుల హామీలకే పరిమితమైపోతున్నాయన్న విమర్శలు ఉన్నాయి.

పాతబస్తీని వెంటాడుతున్న జౌళినాలా..

నిర్మల్ పట్టణంలోని పాతబస్తీ ప్రాంతాన్ని ఔళినాలా కాలువ వెంటాడు తోంది. 25 ఏళ్ల క్రితం వరకు ఈ కాలువ ద్వారా స్వర్ణ ప్రాజెక్టు నీరు పంట పొలాల కోసం ప్రవహించేది. క్రమంగా పట్టణ శివారు ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ వెంచర్లు వెలియడం, అలాగే కాలువకు ఆనుకొని ఉన్న వారంతా దీనిని ఆక్రమించడంతో ఈ కాలువ రూపురేఖలు మారిపోయాయి. ప్రాజెక్టు నుంచి ప్రవాహం నిలిచిపోవడంతో ఇది ప్రధాన మురికికాలువగా మారిపోయింది. దాదాపు పదిహేను వార్డులలోని మురికి నీరంతా ఈ ఔళినాలా కాలువ గుండా ప్రవహిస్తోంది. దీంతో ఇది మరో మూసీనదిగా మారిపోయిందని అంటున్నారు. ఈ కాలువను ఎప్పటికప్పుడు శుభ్రం చేయకపోవడం కారణంగా ఇందులో బురద పేరుకుపోయి చెట్లు, పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. దీంతో మురికి నీటి ప్రవాహానికి ఆటంకాలు ఏర్పడుతున్నాయి. దీని కారణంగా వర్షాకాలంలో వరద నీటితో పాటు మురికి నీరంతా రోడ్లపైనే ప్రవహిస్తుండడమే కాకుండా ఇళ్లల్లోకి కూడా చేరుకుంటోంది. దీంతో ఈ కాలువ పరివాహకంలో ఉన్న ప్రజలంతా ముంపునకు గురవుతున్నారు. ఇంత జరుగుతున్న ఇప్పటి వరకు సంబంధిత అధికార యంత్రాంగం నిర్మల్ పట్టణాన్ని వరద ముప్పు నుంచి కాపాడేందుకు ఎలాంటి పకడ్బందీ ప్రణాళిక రూపొందించకపోవడం పట్ల విమర్శలు తలెత్తుతున్నాయి.



భారీ వర్షానికి రోడ్లపై ప్రవహిస్తున్న వర్షపు నీరు (ఫైల్)

తెరుచుకున్న బాబ్లీ గేట్లు



గేట్లు ఎత్తడంతో బాబ్లీ ప్రాజెక్టు నుంచి దిగువకు వస్తున్న నీరు

బాసర, జూలై, 1 : మహారాష్ట్రలోని గోదావరినదిపై ఉన్న బాబ్లీ ప్రాజెక్టు గేట్లు సోమవారం తెరుచుకున్నాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర కేంద్రం జలవనరుల శాఖ అధికారుల సమక్షంలో ప్రాజెక్టు గేట్లను ఎత్తి నీటిని దిగువకు వదిలారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ఈ వివాదస్పద ప్రాజెక్టు గేట్లు జూలై 1వ తేది నుంచి అక్టోబర్ 29వ తేది వరకు తెరిచి ఉంచాలి. దీని ప్రకారం అధికారులు గేట్లను తెరిచి ఆ ప్రాజెక్టులో ప్రస్తుతం ఉన్న 0.2 టీఎంసీల నీటిని దిగువన ఎస్సారెస్పీ ప్రాజెక్టులోకి విడుదల చేశారు. దీంతో కొంత నీరు శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి వచ్చి చేరింది.

భైంసా ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్ బదిలీ

భైంసా, జూలై 1 : భైంసా ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్ హైదరాబాద్ సౌత్‌ఈస్ట్ జోన్ డిప్యూటీ పోలీసు కమిషనర్‌గా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో గ్రేహౌండ్స్‌లో అసిస్టెంట్ కమాండర్‌గా విధులు నిర్వహిస్తున్న అవినాష్ కుమార్ ఇక్కడికి బదిలీపై రానున్నారు. ఇందుకు సంబంధించి డీజీపీ రవి గుప్తా సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. భైంసా ఏఎస్పీగా కాంతిలాల్ పాటిల్ 2023 జనవరిలో బాధ్యతలు చేపట్టారు. 18 నెలల పాటు ఇక్కడి శాంతిభద్రతల పరిరక్షణకు, మతఘర్షణల నివారణకు, అల్లర్ల నియంత్రణకు విశేషంగా కృషి చేసి అందరిచే మన్ననలను పొందారు. ప్రణాళికబద్ధమైన బందోబస్తు విధానాల ద్వారా అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలలో ఎలాంటి అల్లర్లకు తావులేకుండా సజావుగా నిర్వహింపచేశారు. ఏఎస్పీ కాంతిల్ పాటిల్

బావిలో పడి బాలుడి మృతి



దస్తురాబాద్, జూలై 1 : ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడి బాలుడు మృతి చెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని మల్లాపూర్ గ్రామానికి చెందిన ఎంబడి లావణ్య, మల్లేష్ దంపతుల రెండో కుమారుడు ఎంబడి రాజ్‌కుమార్(13) తన సోదరితో కలిసి వారి పంట పొలంలోని వ్యవసాయ బావి మోటార్ ఆన్ చేయడానికి వెళ్లాడు. ఈ క్రమంలో రాజ్‌కుమార్ కాలు జారీ బావిలో పడిపోయాడు. అది గమనించిన తన సోదరి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా... వారు వెంటనే గ్రామస్థులతో కలిసి బావిలో గాలించారు. నీరు అధికంగా ఉండటం, బాలుడికి ఈత రాకపోవడంతో చనిపోయినట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

లోకేశ్వరం శివాలయంలో చోరీ



లోకేశ్వరం, జూలై 1 : లోకేశ్వరంలోని శివాలయంలో ఆదివారం రాత్రి చోరీ జరిగిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గుర్తు తెలియని వ్యక్తులు శివాలయంలోని హుండీని పగులగొట్టి అందులో గల నగదును దోచుకెళ్లినట్లు ఆలయ పూజారి సోమవారం సాయంత్రం లోకేశ్వరం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా దొంగలు హుండీ పగులగొడుతున్న దృశ్యం ఆలయంలోని సీసీ టీవీలో నమోదై ఉంది. గ్రామం నడిబొడ్డున బస్టాండ్‌కు సమీపంలో చోరీ జరగడంతో గ్రామస్తులు ఆందోళనకు గురవుతున్నారు. గతంలో కూడా ఈ ఆలయం సమీపంలోనే రెండు కార్లను గుర్తు తెలియని వ్యక్తులు దగ్ధం చేశారు. కానీ ఇంతవరకు పోలీసులు వారిని గుర్తించలేక పోయారు. దీంతో లోకేశ్వరం మండల కేంద్ర ప్రజలు ఏ సమయంలో ఏమి జరు గుతుందోనని ఆందోళనకు గురవుతున్నారు. ఇకనైనా నిందితులను గుర్తించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ద్విచక్ర వాహనంపై నుంచి పడి మహిళ మృతి



లక్ష్మి మృతదేహం

ఖానాపూర్, జూలై 1 : ద్విచక్ర వాహనంపై నుంచి పడి ఓ మహిళ మృతి చెందిన ఘటన ఖానాపూర్ మండలంలోని పాత ఎల్లాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే పోలీసులు తెలిపిన కథనం ప్రకారం... సోమవారం మామడ గ్రామానికి చెందిన మేకల లక్ష్మీ తన అల్లుడు జంగా చంద్రయ్యతో కలిసి ద్విచక్రవాహనంపై ఇందనపెల్లి తన బంధువుల ఇంటికి బయలుదేరింది. కాగా మార్గమధ్యంలో ఖానాపూర్ మండలం పాత ఎల్లాపూర్ వద్ద లక్ష్మీ ద్విచక్ర వాహనంపై నుంచి కింద పడింది. తలకు వెనుక వైపున బలమైన గాయం కావడంతో లక్ష్మీ అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. చంద్రయ్య అజాగ్రత్తగా ద్విచక్ర వాహనాన్ని నడపడంతోనే ప్రమాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు. మృతురాలి కుమారుడు మేకల రవీందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

చేపల వేటకు వెళ్లి ఒకరి మృతి



మృతదేహం పరిశీలిస్తున్న పోలీసులు

లక్ష్మణచాంద, జూలై 1 : మండలంలోని నర్సాపూర్(డబ్ల్యూ) గ్రామానికి చెందిన దేశబోయిన పోశెట్టి అనే వ్యక్తి చేపలు పట్టడానికి వెళ్లి మృతి చెందిన సంఘటన సోమవారం జరిగింది. ఎస్సై సుమలత తెలిపిన వివరాల ప్రకారం... ఎప్పటిలాగే పోశెట్టి స్థానిక చెరువులోకి చేపల వేటకు వెళ్లాడు. వల విసురుతుండగా ప్రమాదవశాత్తు వల చుట్టుకొని నీటిలో పడి మృతి చెందాడు. విషయం తెలిసిన వెంటనే సంఘటన స్థలానికి వెళ్లి పంచనామా నిర్వహించారు. సెక్షన్ 194(1) భారతీయ నాగరిక్ సురక్ష సంహిత చట్టం ప్రకారం కేసు నమోదు చేశామని ఆమె తెలిపారు.

యువతి అదృశ్యం.. కేసు నమోదు



అర్చన (ఫైల్)

నర్సాపూర్(జి), జూలై 1 : మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన యువతి మంత్రి అర్చన (22) సోమవారం ఉదయం ఆరు గంటలకు ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. తల్లి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తునట్లు ఎస్సై మునిగెల హన్మాండ్లు తెలిపారు.

రుద్ర శంకర్‌కు వట్టికోట అల్వారు స్వామి స్మారక అవార్డు

ఖానాపూర్, జూలై 1 : ఖానాపూర్ వాసి తెలంగాణ ఉద్యమకారుడు రుద్ర శంకర్‌కు హైదరాబాద్‌కు చెందిన కామన్ డయాస్ అనే సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో శ్రీ వట్టికోట అల్వారు స్వామి స్మారక అవార్డును అందజేశారు. రుద్రశంకర్‌ను నిస్వార్థ తెలంగాణ ఉద్యమకారుడిగా గుర్తించారు. ఈ అవార్డును మహాకవి బోయ భీమన్న సతీమణి హైమావతి, ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త శ్రీ దైవాజ్ఞశర్మల చేతుల మీదుగా అందుకున్నట్లు అవార్డు గ్రహీత సోమవారం ఆంధ్రజ్యోతికి ఫోన్ ద్వారా తెలిపారు. ఈ కార్యక్రమంలో భాషా సాంస్కృతిక డైరెక్టర్ మామిళ్ల హరికృష్ణ, కామన్ డయాస్ అధ్యక్షులు తంగేళ్లపల్లి కనకాచారి, తెలంగాణ తల్లి రూపశిల్పి వీఆర్ చారి, రచయిత్రి డాక్టర్ పి. లలితారాణి, హరిత్ రూడా, ప్రముఖ రచయిత జయసూర్య, సినీ దర్శకులు మంజుల, శైలజ, తదితరులున్నట్లు ఆయన పేర్కొన్నారు.

విద్యుత్ అధిక బిల్లులపై ట్రాన్స్‌కో ఏఈకి ఫిర్యాదు

ముథోల్, జూలై 1 : అధిక విద్యుత్ బిల్లులు వస్తున్నాయని సోమవారం మండల కేంద్రమైన ముథోల్ గ్రామస్థులు ట్రాన్స్‌కో ఏఈ శ్రీకాంత్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రైవేట్ ఉద్యోగి ప్రతి నెల విద్యుత్ మీటర్లలో ఉన్న రీడింగ్‌ను స్కానింగ్ చేయకుండా మాన్యువల్‌గా బిల్లులు వేయడంతో నష్టపోతున్నామని అన్నారు. మీటర్‌లో ఉన్న యూనిట్ల రీడింగ్ ఒక విధంగా అతను ఇచ్చే విద్యుత్ కరెంటు బిల్లు చీటీపై మరొక రీడింగ్ ఉండడంపై గ్రామస్థులు మండిపడ్డారు. దీంతో అధికవిద్యుత్ బిల్లులు రావడంతో గృహజ్యోతికి అనర్హులుగా అవడంతో అన్యాయం జరుగుతుందన్నారు. గతంలో సదరు ప్రైవేట్ ఉద్యోగి పదుల సంఖ్యలో మీటర్‌రీడింగ్‌కి తన ఇష్టానుసారంగా బిల్లును నమోదు చేస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రైవేట్ ఉద్యోగిని తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై స్పందించిన ఏఈ శ్రీకాంత్ సంబంధిత ఉన్నతాధికారులకు ఫోన్ ద్వారా మాట్లాడారు. మరొకరిని నియమిస్తామని తెలిపారు.

భూగర్భ జలాల పెంపునకు చర్యలు తీసుకోవాలి

కలెక్టర్ అభిలాష అభినవ్



మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ కల్చరల్, జూలై 1 : జిల్లాలో భూగర్భ జలాల పెంపుకోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కేంద్ర జలశక్తి అభియాన్ డైరెక్టర్, నోడల్ అధికారి అనిత, సాంకేతిక అధికారి సుశాంత్‌కుమార్ రాతా ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భూగర్భ జలాల పెంపుకు, సంరక్షణకు నారిశక్తి సే జలశక్తి అనే ఇతివృత్తంతో చర్యలు చేపట్టినట్లు వివరించారు. జిల్లాలోని కడెం, స్వర్ణ, గడ్డెన్న వాగు ప్రాజెక్టు, సదర్మాట్ బ్యారేజ్‌ల ఆయకట్టు, సాగువిస్తీర్ణం తదితర అంశాలు అధికారులకు తెలియజేశారు. బోరు బావుల వద్ద నీటి లభ్యత పెంచేందుకు రీచార్జ్ శాఫ్ట్ అనే అధునాతన పద్ధతి వినియోగిస్తున్నామని అన్నారు. ఉపాధి హామీ పథకం పనుల ద్వారా గుంతలు ఏర్పాటు చేశామని, మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికి శుద్ధమైన తాగునీరు అందజేస్తున్నట్లు స్పష్టం చేశారు. ఇంకుడు గుంతల ఏర్పాటు తదితర అంశాలు వారి దృష్టికి తెచ్చారు. నోడల్ అధికారి మాట్లాడుతూ... వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాల పెంపుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. భావితరాలకు నీరుండేలా నీటిని సంరక్షించాలని సూచించారు. అదనపు కలక్టర్ ఫైజాన్ అహ్మద్, డీఆర్డీవో విజయలక్ష్మి, డిప్యూటీ ఈఈ శ్రీనివాస బాబు, పీఆర్ ఈఈ శంకరయ్య తదితరలు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి

నిర్మల్ అర్బన్ : ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల అర్జీలను ఆమె స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రజల సమస్యలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఇప్పటి వరకు శాఖల వారీగా పెండింగ్‌లో ఉన్న జిల్లా ప్రజావాణి, సీఎం ప్రజావాణి దరఖాస్తుల పరిశీలన చేపట్టి ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ధరణి, రెవెన్యూ, వ్యవసాయం, కొత్త రేషన్ కార్డులు, పింఛన్లు, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు, ఇతర భూ సమస్యల వంటి అంశాలపై ఫిర్యాదు అధికంగా వచ్చాయని సంబంధిత శాఖల అధికారులు దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. వన మహోత్సవ కార్యక్రమంలో విరివిగా మొక్కలు నాటాలని, శాఖల వారీగా నిర్దేశించిన లక్ష్యం మేరకు మొక్కలు నాటేలా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మండలాల వారీగా ప్రత్యేక అధికారులు ప్రభుత్వ హాస్టళ్లు, త్రాగునీరు, శానిటేషన్‌లో ఎలాంటి ఇబ్బందులు తలెతకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్, డీఆర్‌వో భుజంగ్ రావు, ఆర్డీవో రత్నకళ్యాణి, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పట్టా భూములకు సర్వే చేయించాలని రైతుల వినతి

సారంగాపూర్, జూలై 1 : మండలంలోని గోపాల్‌పేట్ గ్రామానికి చెందిన రైతులు పట్టా భూములకు సర్వే చేయించాలని సోమవారం కలెక్టర్ అభిలాష అభినవ్‌కు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గత కొన్ని సంవత్సరాల నుండి పట్టాలు కలిగి సాగు చేసుకుంటున్న పట్టా భూముల చుట్టూ రెవెన్యూ, అటవీశాఖ అధికారులు ట్రెంచ్ ఏర్పాటు చేశారని, సాగు చేసుకుంటున్న పట్టా భూముల చుట్టూ ఏర్పాటు చేసిన ట్రెంచ్‌ను తొలగించాలని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకవెళ్లినా సమస్యను మాత్రం పరిష్కరించకుండా వ్యవహరించారని ఆవేదన వ్యక్తం చేశారు.

వెట్టి చాకిరి నుంచి చిన్నారులను విముక్తి చేద్దాం : ఎస్పీ జానకి షర్మిల

నిర్మల్ కల్చరల్, జూలై 1 : వెట్టి చాకిరి నుండి చిన్నారులను విముక్తి చేసేందుకు ప్రభుత్వ విభాగాలు, స్వచ్ఛంద సంస్థలు కలిసి పనిచేద్దామని ఎస్పీ జానకి షర్మిల పిలుపునిచ్చారు. సోమవారం చైల్డ్ వెల్ఫేర్, ప్రొటెక్షన్, రెవెన్యూ, విద్యాశాఖ, కార్మిక శాఖల అధికారులతో పోలీసు కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ నెల 1 నుంచి 31 వరకు జిల్లాలో ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.


తప్పిపోయిన, వదిలివేసిన, నిర్లక్ష్యానికి గురైన, రోడ్డుపై బిక్షాటన చేస్తున్న బాలకార్మికులను గుర్తించి 18 ఏళ్లలోపు వారిని పునరావాస కేంద్రాలకు తరలించాలన్నారు. తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ నిర్వహించి వారికైనా అప్పగించాలన్నారు. బాల కార్మికులు కనబడితే వెంటనే డయల్ 100, 1098 చైల్డ్ లైన్ టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలని సూచించారు. వెట్టి చాకిరి చేయించుకోవడం చట్టరీత్యా నేరమని తెలిపారు. పనిలో పెట్టుకున్న వారిపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామన్నారు. అదనపు ఎస్పీ సూర్యనారాయణ, భరోసా కేంద్రం ఇన్‌చార్జీ అధికారి జ్యోతిమణి, సోన్ సీఐ నవీన్‌కుమార్, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

గుర్తింపు లేని ప్రైవేటు పాఠశాలలను రద్దు చేయాలి

టీజీవీపీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు కొట్టూరి ప్రవీణ్‌కుమార్

నిర్మల్ చైన్‌గేట్, జూలై 1 : నిర్మల్ జిల్లా వ్యాప్తంగా గుర్తింపు లేకుండా అక్రమంగా కొనసాగిస్తున్న ప్రైవేటు పాఠశాలలను రద్దు చేయాలని తెలంగాణ విద్యార్థి పరిషత్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు కొట్టూరి ప్రవీణ్ కుమార్ అన్నారు. సోమవారం నిర్మల్ జిల్లా కేంద్రంలోని గాంధీ పార్కుల ఎదుట ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.... నిర్మల్ జిల్లా వ్యాప్తంగా ఉన్న పలు ప్రైవేటు పాఠశాలల్లో అవినీతి రాజ్యమేలుతుందన్నారు. నిబంధనలకు విరుద్దంగా తల్లిదండ్రుల వద్ద నుంచి అధిక మొత్తంలో ఫీజులను వసూలు చేయడంతో పాటు యూనిఫామ్స్, బుక్స్, బెల్ట్, టైలను పాఠశాలలోనే అమ్ముతూ భారీగా డబ్బులు దండుకుంటున్నారన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో ఇంత జరుగుతుందని తెలిసి కూడా ఉన్నతాధికారులు చూసిచూడనట్లు వ్యవహరించడం సరికాదన్నారు. వెంటనే విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించి అన్ని ప్రైవేటు పాఠశాలలను తనిఖీ చేసి నిబంధనలకు విరుద్దంగా నడుస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ పట్టణ కో కన్వీనర్ మిథున్, సాయి, పోశెట్టి, తరుణ్, జాన్సన్‌లున్నారు

పీఆర్ సబ్ డివిజన్ డీఈఈగా రాజేందర్‌రావు



దిలావర్‌పూర్, జూలై 1 : పంచాయతీరాజ్ సబ్ డివిజన్ డీఈఈగా రాజేందర్‌రావు సోమవారం దిలావర్‌పూర్‌లోని కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు నిర్మల్ డీఈఈ తుక్కారం ఇన్‌చార్జీ డీఈఈ బాధ్యతలు నిర్వహించారు. దిలావర్‌పూర్‌కు పూర్తిస్థాయి డీఈఈ రావడంతో అధికారులు, ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. నూతన డీఈఈ రాజేందర్‌రావును పలువురు శాలువాతో సన్మానించారు. దిలావర్‌పూర్ సబ్ డివిజన్ పరిధిలోని మండలాల అభివృద్ధికి తనవంతు సహకారాన్ని అందిస్తానని రాజేందర్‌రావు అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో అజీజ్ ఖాన్, ఎంపీపీ అక్షర అనిల్, పీఆర్ ఏఈ శివకృష్ణ, స్థానిక నాయకులు అనిల్, రాజారెడ్డి, ఓడ్నం కృష్ణ, రమణ, కుంటాల, లోకేశ్వరం పీఆర్ ఏఈలు, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

బాసర రైల్వేస్టేషన్‌లో చైన్‌స్నాచింగ్

- 3 తులాల బంగారం గొలుసు దోపిడీ

బాసర, జూలై, 1 : బాసర రైల్వే స్టేషన్ ప్రాంగణంలో దోపిడి ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆదివారం సాయంత్రం సికింద్రాబాద్ నుంచి ముంబాయి వెళ్లే దేవగిరి రైలు నుంచి ఒక మహిళ ప్రయాణికురాలు బాసర రైల్వేస్టేషన్ దిగే క్రమంలో దుండగులు చైన్ స్నాచింగ్‌కు పాల్పడ్డారు. 3 తులాల బంగారం గొలుసును తెంపుకొని పరారయ్యారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

జిల్లాలో పలుచోట్ల కురిసిన వర్షం

- అత్యధికంగా బాసర మండలంలో 37.4 మిలీమీటర్ల వర్షపాతం నమోదు

ఖానాపూర్, జూలై 1 : జిల్లా వ్యాప్తంగా పలుచోట్ల వర్షం కురిసింది. ఆదివారం రాత్రి నుంచి సోమవారం తెల్లవారు జాము వరకు జిల్లాలోని పలు మండలాల్లో విస్తారంగా వర్షం కురవడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అత్యధికంగా బాసర మండలంలో 37.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా పెంబిలో అత్యల్పంగా 1.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లా వ్యాప్తంగా 17 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

జిల్లాలో 735 మంది ఉపాధ్యాయుల బదిలీ

జిల్లాలో మొత్తం 735 మంది ఎస్‌జీటీ ఉపాధ్యాయుల బదిలీలు జరిగాయని డీఈవో రవీందర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 895 మంది బదిలీకి దరఖాస్తు చేసుకున్నారని పేర్కొన్నారు. బదిలీ అయిన ఉపాధ్యాయులను సోమవారం రిలీవ్ అయి నూతన పాఠశాలల్లో చేరాలని ఆదేశించినట్లు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నిర్మల్ కల్చరల్, జూలై 1 : శాంతినగర్ 11 కేవీ ఫీడర్ మరమ్మతుల దృష్టా మంగళవారం ఉదయం 9 నుంచి 12 వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ తెలిపారు. గాయత్రి టౌన్‌షిప్, డిగ్రీ కాలేజీ, పాలిటెక్నిక్ కాలేజీ, హౌసింగ్ బోర్డు కాలనీ ఏరియాల్లో అసౌకర్యం కలుగుతుందన్నారు.

11కేవీ విద్యుత్ తీగలను తొలగించాలని ఏఈకి వినతి

కుభీర్, జూలై 1 : మండల కేంద్రం కుభీర్‌లోని న్యూ అబాది లో గల 11కేవీ విద్యుత్ తీగలను తొలగించాలని సోమవారం గ్రామస్తులు ఏఈకి వినతిపత్రం అందజేశారు. గతంలో ఈ వయర్ల వలన ప్రమాదం జరిగి చాలా నష్టపోయాని, తొలగించాలని అధికారులను కోరినప్పటికి పట్టించుకోవడం లేదని, ఇప్పటికయిన స్పందించి విద్యుత్‌లైన్‌ను తొలగించాలని కోరారు. వినతి అందించిన వారిలో సాప పండరి, పోతన్న, హన్మండ్లు, తదితరులున్నారు.

నాణ్యమైన బియ్యాన్ని అందించాలి

నిర్మల్ కల్చరల్, జూలై 1 : ప్రభుత్వ వసతి గృహాలకు నాణ్యమైన బియ్యాన్ని అందించాలని బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎంబడి చంద్రశేఖర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో నాసిరకం బియ్యం సరఫరా చేస్తే విద్యార్థులు రోగాల బారిన పడనున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.